

వరికి తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

» అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త భవాని

అచ్యుతాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పుల కారణంగా వరి పైరును తెగుళ్ల ఆశించే అవకాశం వుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త బి.భవాని అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని కొండకర్ల, అందలాపల్లి, ఎర్రవరంలో వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరి పంటను అక్కడక్కడ మెడ విరుపు తెగులు ఆశించిందని, దీని నివారణ కోసం లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున ట్రైసైక్లోజోల్ కలిపి పిచికారీ చేయాలన్నారు. కంకులు వచ్చే దశలో వున్న వరి పైరును రెల్ల రాల్చు పురుగు ఆశించే అవకాశం వుందని, దీని నివారణకు వేపనూనె 1500 పీపీఎం అనే మందును లీటరు నీటికి ఐదు ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పొట్టదశలో ఉన్న వరి పైరుకు ఎకరాకు పొటాష్ 20 కిలోలు, యూరియా 20 కిలోలు కలిపి చల్లుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీటీ-కేవీకే శాస్త్రవేత్త వానా ప్రసాద్, వ్యవసాయ విస్తరణాధికారి కేబీ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వరి పైరును పరిశీలిస్తున్న ఆర్‌ఏఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త బి.భవాని

బిడ్డతోసహా భార్య ఆత్మహత్య కేసులో

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

బుచ్చెయ్యపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేపీ అగ్రహారం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు పి.ఉమా మహేశ్వరరావును సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యా శాఖ అధికారి జి.అప్పలనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. ఇతను కుటుంబంతో కలిసి చోడవరంలో నివాసం వుండేవారు. ఈ నెల 12వ తేదీన భార్య వీణ, ఆరు నెలల బిడ్డతో కలిసి ఆత్మహత్య చేసుకుంది. అదనపు కట్నం కోసం భర్త వేధించినందునే వీణ ఆత్మహత్య చేసుకుందని ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. నిందితుడు ఉమా మహేశ్వరరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అరెస్టు అయి 48 గంటలు దాటినందున సర్వీసు రూల్స్ ప్రకారం అతనిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈవో-2 బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో 'అఖండ-2' టీమ్



సింహాచలం దేవస్థానంలో సినీ హీరో బాలకృష్ణ

సింహాచలం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'అఖండ-2' సినిమా హీరో నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను, నిర్మాత రామ్ ఆచంట మంగళవారం సింహాచలం వరాహలక్ష్మీనృసింహస్వామి ని దర్శించుకున్నారు. సినీ ప్రముఖులకు దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. బాలకృష్ణ, బోయపాటి శ్రీను, తదితరుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. అనంతరం కప్పస్తంభ ఆలింగనం, బేడామండప ప్రదక్షిణ, గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు చేసిన తరువాత ఆలయ పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువాతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.



విశాఖలోని జగదాంబ థియేటర్‌లో మంగళవారం రాత్రి 'అఖండ-2' సినిమాలోని పాటను విడుదల చేసిన సందర్భంగా అభిమానులను ఉద్దేశించి మాట్లాడుతున్న నందమూరి బాలకృష్ణ (-వార్త 'చిత్రజ్యోతి'లో)

ఐక్యతతో డ్రగ్స్ నిర్మూలన

ప్రజా ఉద్యమంగా మారిన 'అభ్యుదయం సైకిల్ యాత్ర'
డీఐజీ గోపీనాథ్ జట్టి

అనకాపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ నియంత్రణలో భాగంగా పోలీస్ శాఖ చేపట్టిన 'అభ్యుదయం సైకిల్ యాత్ర' ప్రజా ఉద్యమంలా మారిందని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. అభ్యుదయ సైకిల్ యాత్రలో భాగంగా మంగళవారం ఎన్టీఆర్ మార్కెట్ యార్డు వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి 'డ్రగ్స్ ఫ్రీ' సందేశం చేరడమే ఈ యాత్ర లక్ష్యమని అన్నారు. యావత్ సమాజం కలిసికట్టుగా పనిచేస్తే డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించగలమన్నారు. గంజాయి కేసులకు సంబంధించి రేంజ్ పరిధిలో గత ఏడాది 2,500 మందిని అరెస్టు చేయగా, వీరిలో 77 మందికి 20 ఏళ్లపాటు జైలు పడిందన్నారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ, డ్రగ్స్‌తోపాటు సోషల్ మీడియా సహా దేనికైనా బానిసలుగా మారకూడదని విద్యార్థులకు సూచించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ, దశాబ్ద కాలంలో డ్రగ్స్ వినియోగం 200 శాతం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈగల్ టీమ్ ఏర్పడిన తరువాత రాష్ట్రంలో మాదకద్రవ్యాల రవాణా, వినియోగం తగ్గాయని అన్నారు. ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ, డ్రగ్స్ పై సమాచారం ఇవ్వడానికి 112 లేదా 1972 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. డ్రగ్స్ బారి నుంచి యువతను రక్షించడం అందరి బాధ్యత అని అన్నారు. అనంతరం అదనపు ఎస్పీ దేవప్రసాద్ ర్యాలీని ప్రారంభించారు. డీఐజీ, ఎస్పీ, కలెక్టర్, ఎమ్మెల్యే, తదితరులు సైకిళ్లు తొక్కుతూ మెయిన్‌రోడ్డు మీదుగా నెహ్రూచౌక్ వరకు యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌యూఎఫ్‌ఐడీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, డీఎస్పీలు ఎం.శ్రావణి, ఈ.శ్రీనివాసులు, సీఐలు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సైకిల్ యాత్రలో డీఐజీ గోపీనాథ్ జట్టి, కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎస్పీ తుహిన్‌సిన్హా

మావోల కదలికలపై పటిష్ఠ నిఘా

» ఉత్తరాంధ్రలో షెల్టర్లకు అవకాశం లేదు
» సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి
» రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి

నర్సీపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టుల కదిలికలపై నిఘాను పటిష్ఠం చేసి అప్రమత్తంగా ఉన్నామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. మంగళవారం ఇక్కడకు వచ్చిన ఆయన డీఎస్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. విజయవాడలో మాదిరిగా ఉత్తరాంధ్రలోని పట్టణ ప్రాంతాల్లో మావోయిస్టులు తలదాచుకునే అవకాశం లేదని అన్నారు. నక్సలైట్లు/ మావోయిస్టుల ప్రభావం లేకపోతే ఏజెన్సీ ప్రాంతం మరింత అభివృద్ధిచెంది వుండేదని ఆయన ... మిగతా 6వ పేజీలో



మీడియా సమావేశంలో డీఐజీ గోపీనాథ్ జట్టి. చిత్రంలో ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీ శ్రీనివాసరావు వున్నారు.

నేడు రైతులకు పెట్టుబడి సాయం

అన్నదాత సుఖీభవ రెండో విడత, పీఎం కిసాన్ 21వ విడత నిధులు విడుదల

» జిల్లాలో 2,42,480 మందికి రూ.158.4 కోట్లు
» నేటి నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ
» సబ్బవరంలో జిల్లాస్థాయి సభ



అనకాపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'ప్రధానమంత్రి కిసాన్- అన్నదాత సుఖీభవ' పథకాల కింద రైతులకు పెట్టుబడి సాయం నిధులు విడుదల చేశాయి. జిల్లాలో 2,42,480 మంది రైతులకు రూ.158.4 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 19వ తేదీ నుంచి రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు అవుతుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది ఆగస్టులో తొలి విడతగా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.7 వేల చొప్పున ప్రభుత్వం జమ చేసిన విషయం తెలిసిందే. దీంతో రెండు పథకాల ద్వారా 2,42,536 మంది రైతులకు రూ.161.45 కోట్లు అందాయి. తాజాగా బుధవారం పీఎం కిసాన్ 21వ విడత కింద రూ.2 వేలతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అందించే 2వ విడత అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి. జిల్లాలో పీఎం కిసాన్ యోజన కింద 1,85,754 మందికి రూ.37.16 కోట్లు, అన్నదాత సుఖీభవ పథకం కింద 2,42,480 మంది రైతులకు రూ.121.24 కోట్లు... మొత్తం రూ.158.4 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 17,045 మంది ... మిగతా 6వ పేజీలో

పెట్రోలియం వర్సిటీ రెడీ

సబ్బవరం మండలం వంగలిలో రూ.400 కోట్లతో భవనాల నిర్మాణం

» మరో రూ.100 కోట్లతో ల్యాబ్, రూ.50 కోట్లతో ఫర్నీచర్, ఇతర వసతులు
» జనవరి ఐదో తేదీ నుంచి నూతన క్యాంపస్‌లో తరగతులు ప్రారంభానికి సన్నాహాలు
» ప్రస్తుతం ఏయూలో నిర్వహణ



పెట్రోలియం వర్సిటీ నూతన క్యాంపస్

విశాఖపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): **ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ)కి శాశ్వత క్యాంపస్ సిద్ధమైంది. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం వంగలి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 157.36 ఎకరాల్లో భవన నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. దీంతో ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ నుంచి అక్కడకు షిఫ్ట్ అయ్యేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి శాశ్వత క్యాంపస్‌కు వెళ్లాలని అధికారులు భావించారు. అయితే, కొన్ని పనులు పెండింగ్‌లో ఉండడం, ఇతర కారణాలతో జనవరి ఐదో తేదీ నుంచి శాశ్వత క్యాంపస్‌లో తరగతులు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేసుకున్నారు.**

వంగలిలో సుమారు రూ.400 కోట్ల వ్యయంతో భవన నిర్మాణాలను చేపట్టారు. మరో రూ.100 కోట్లతో అత్యాధునిక లేబొరేటరీ, లైబ్రరీ, మరో రూ.50 కోట్లతో ఫర్నీచర్, ఇతర మౌలిక సదుపాయాలను సమకూర్చుకున్నారు. ప్రస్తుతం వర్సిటీ అవసరాలకు అనుగుణంగా మొదటి ఫేజ్ నిర్మాణాలను పూర్తిచేశారు. భవిష్యత్తు అవసరాల కోసం రెండో ఫేజ్ నిర్మాణాలను చేపట్టనున్నారు. ఇందుకోసం కూడా కేంద్ర ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరుచేసింది.

విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఈ వర్సిటీని రాష్ట్రానికి కేటాయించగా, 2016 నుంచి ఏయూలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. పెట్రోలియం ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మ్యాథ్స్ అండ్ కంప్యూటింగ్, ఎమ్మెస్సీ అప్లైడ్ జియాలజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నారు.

గృహ రేటింగ్ సాధించేలా..

వాతావరణానికి హాని కలిగించకుండా, సహజ వనరులను సద్వినియోగం చేసుకునే విధంగా ఉండే భవన నిర్మాణాలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ రేటింగ్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హాబిటేట్ అసెస్‌మెంట్ (గృహ) పేరుతో రేటింగ్స్ ఇస్తోంది. గృహ రేటింగ్ 4 సాధించేలా పెట్రోలియం వర్సిటీ భవన నిర్మాణాలను పూర్తిచేశారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు, వినియోగించిన నీరు ... మిగతా 6వ పేజీలో

శారదా నదిలో ఇసుక పంట!

» ఇసుక తవ్వకాలు, విక్రయాల కోసం గ్రామాల్లో అనధికారికంగా వేలం పాటలు
» అధికార, ప్రతిపక్ష నేతలు కుమ్మక్కు

మొంథా తుఫాన్ వరదలతో భారీగా మేటలు





శారదా నదిలో ఇసుక మేటలు. (ఇన్‌సెట్‌లో) తెనుగుపూడి వద్ద శారదా నది గట్టు సమీపంలో ఇసుక తవ్వకాలు

దేవరాపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): **మొంథా తుఫాన్ సమయంలో కురిసిన భారీ వర్షాలతో మండలంలోని పలుచోట్ల శారదా నదిలో భారీ మొత్తంలో ఇసుక మేటలు వేసింది. ఇదే అదనుగా భావించిన గ్రామస్థాయి నాయకులు.. పార్టీలకు అతీతంగా ఇసుక తవ్వకాల కోసం వేలం పాటలు నిర్వహిస్తున్నారు.**

మండలంలో తామరబ్బ, సమ్మెద, చింతలపూడి, దేవరాపల్లి, తెనుగుపూడి, వెంకటరాజపురం, తిమిరాం, మామిడిపల్లి, వేచలం, కలిగొట్ల, బి.కింతాడ గ్రామాల పరిధిలో శారదా నదిలో పలుచోట్ల ఇసుక మేటలు వేసింది. కానీ మండలంలో ఎక్కడా అధికారికంగా ఇసుక రీచ్‌లు లేదు. అయితే స్థానికంగా ఇళ్లు, ఇతర నిర్మాణాల నిమిత్తం ముందస్తు అనుమతితో నదుల్లో నుంచి నిర్ణీత పరిమాణంలో ఇసుక తీసుకెళ్లవచ్చని ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. దీనిని గ్రామాల్లో కొంతమంది నాయకులు తమకు అనుకూలంగా మార్చుకుని దర్జాగా ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు. ఇందుకోసం శారదా నదిలో వున్న ఇసుక నిల్వలు, రవాణా సదుపాయం, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని వేలం పాటలు నిర్వహిస్తున్నారు. తెనుగుపూడి వద్ద నదిలో ఏడాదిపాటు ఇసుక తవ్వకాల కోసం రూ.30 లక్షలకు వేలం పాట పాడినట్టు తెలిసింది. రాజకీయంగా ప్రత్యర్థులుగా వున్న నేతలు.. ఇసుక విషయానికి వచ్చేసరికి ఒక్కటవుతున్నారు. శారదా నదిలో చింతలపూడి, తామరబ్బ గ్రామాల పరిధిలో ఇసుక తవ్వి, విజయనగరం జిల్లా ఎస్.కోట మండలంలోని గ్రామాలకు రవాణా చేస్తున్నారు. తెనుగుపూడి నుంచి ఇదే జిల్లా వేపాడ, ఎల్.కోట, కొత్తవలస మండలాలకు సరఫరా చేస్తున్నారు. ఇక రైవాడ రిజర్వాయర్‌కు ఎగువున వున్న అనంతగిరి మండల పరిధిలో ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. నది నుంచి ఉన్న దూరాన్నిబట్టి ట్రాక్టర్ ఇసుక రూ.3 వేల నుంచి రూ.6 వేల వరకు విక్రయిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతిచెందిన సిబా పెడెంటి

పరవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి- గాజువాక ప్రధాన రహదారిలో మండలంలోని ఊటగెడ్డ జంక్షన్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాలోని రాయగడ ప్రాంతానికి చెందిన సిబా పెడెంటి (27), మరో ముగ్గురు స్నేహితులు కలిసి కొంతకాలం నుంచి లంకెలపాలెంలోని ఒక హోటల్‌లో వెయిటర్స్‌గా పనిచేస్తున్నారు. సిబా సోమవారం రాత్రి విధులు ముగించుకొని వ్యక్తిగత పనిమీద ద్విచక్ర వాహనంపై ధర్మారాయుడుపేటకు బయలుదేరాడు. ఊటగెడ్డ జంక్షన్ దాటిన తరువాత రోడ్డుపై చనిపోయి ఉన్న గేదెను గమనించక బలంగా ఢీకొని రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మావోయిస్టులకు గట్టి దెబ్బ

మారేడుమిల్లి అడవుల్లో పోలీసుల కాల్పుల్లో అగ్ర నేతలు హిడ్మా, రాజేతో పాటు మరో నలుగురు మృతి

» జల్లెడ పడుతున్న పోలీసు బలగాలు



మడివి హిడ్మా(ఫైల్)

పాడేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం జరిగిన ఎదురు కాల్పుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మడివి హిడ్మా, అతని భార్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు మడకం రాజే, మరో నలుగురు సభ్యులు మృతిచెందడంతో ఆ పార్టీకి తీవ్ర నష్టం వాటిల్లింది.

ఫలించిన పోలీసుల వ్యూహం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దండకారణ్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు గాలింపుల నేపథ్యంలో మావోయిస్టులు సురక్షిత ప్రాంతాలకు తరలుతున్నారు. అంతగా పోలీసుల హడావిడి లేని మారేడుమిల్లి అటవీ ప్రాంతాన్ని ఆశ్రయించారు. ఇదే అదనుగా వారిని మట్టుపెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు ఛత్తీస్‌గఢ్, ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మాటేశాయి. ఛత్తీస్‌గఢ్ నుంచి బయటకు వచ్చిన మావోయిస్టులు మారేడుమిల్లి అటవీ ప్రాంతానికి చేరినట్టు పక్కాగా సమాచారం సేకరించిన ... మిగతా 6వ పేజీలో

గ్రేడ్-1 ఏజీపీగా అప్పలనాయుడు నియామకం



కశింకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా కోర్టులు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులకు గ్రేడ్-1 అదనపు ప్రభుత్వ న్యాయవాది (ఏజీపీ)గా ప్రముఖ న్యాయవాది కన్నూరు అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం న్యాయశాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. అప్పలనాయుడు విశాఖపట్నం జిల్లా కోర్టులు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టుల పరిధిలో ప్రభుత్వం తరఫున వివిధ సివిల్ కేసుల్లో వాదనలు వినిపించనున్నారు. ప్రభుత్వ ప్రయోజనాల పరిరక్షణకు అనుగుణంగా న్యాయపరమైన వ్యవహారాల్లో తగిన చర్యలు చేపట్టనున్నారు. కశింకోట మండలం పాత కన్నూరుపాలెం గ్రామానికి చెందిన కన్నూరు అప్పలనాయుడు.. 2006-09లో ఏయూ నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. అనంతరం విశాఖపట్నం జిల్లా కోర్టులో న్యాయవాది వృత్తిని ప్రారంభించారు. ఏజీపీగా నియమితులైన అప్పలనాయుడుకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్, కార్యదర్శి ఎల్.పి.నాయుడు, బార్ కౌన్సిల్ వైస్‌చైర్మన్ ఎస్.కృష్ణమోహన్, సభ్యులు పి.నర్సింగరావు, కె.రామజోగేశ్వరరావు, భైపా అరుణ్‌కుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి : ఎంపీడీవో



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

పాయకరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత, పారిశుధ్యం మెరుగు తదితర కార్య క్రమాల నిర్వహణకు ప్రజాప్రతినిధులు కృషిచేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి కోరారు. మంగళవారం స్థానిక మండలపరిషత్ సమావేశ హాల్లో నిర్వహించిన సర్పంచులు, ఉపసర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామాలాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వీటిని ప్రజా ప్రతినిధులు, కార్యదర్శులు సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి వైవీ.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలు, వాటి అమలు తదితర అంశాలపై ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు.

అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్‌పై అవేర్‌నెస్ వర్క్‌షాప్ రేపు

అచ్యుతాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీఐఐసీ వన్‌స్టాప్ సెంటర్‌లో ఈనెల 20న నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీంపై అవేర్నస్ వర్క్‌షాప్‌ని నిర్వహిస్తున్నట్టు ఎల్ఎస్ఎస్ఎస్‌డీసీ క్లస్టర్ హెడ్ పి. అమరేంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్క్‌షాపును లైఫ్ సైన్సెస్ స్కిల్ సెక్టార్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎల్ఎస్ఎస్ఎస్‌డీసీ), అచ్యుతాపురం ఇండస్ట్రియల్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుందన్నారు. ఉపకార వేతనం నూతన నియమావళి, ప్రభుత్వ సహాయం, సీఎస్ఆర్ నిధులు వినియోగం, మానవ వనరులు అభివృద్ధి చేయడం వంటి వాటిని వివరిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈసదస్సుకు వివిధ కర్మాగారాల హెచ్ఆర్ హెడ్స్, ప్లాంట్ మేనేజర్లు, సైట్ హెడ్స్, ట్రైనింగ్ అండ్ కాంప్లియన్స్ అధికారులు, సీఎస్ఆర్ హెడ్స్ హాజరు కావాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 90959 36122, 88002 82887 నంబర్లను సంప్రదించాలన్నారు.

హెటెరో డైరెక్టర్ మోహన్‌రెడ్డికి సన్మానం



హెటెరో డైరెక్టర్‌ను సత్కరిస్తున్న కొప్పిశెట్టి బుజ్జి, తదితరులు

నక్కపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపమాక శివాలయంలో కార్తీకమాసం సందర్భంగా సోమవారాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి సహకరించిన హెటెరో సంస్థను నిర్వాహకులు ప్రశంసించారు. ఈ సందర్భంగా మంగళవారం హెటెరో సంస్థ డైరెక్టర్ మోహన్‌రెడ్డిని పీఏసీఎస్ చైర్‌పర్సన్ కొప్పిశెట్టి బుజ్జి, కొప్పిశెట్టి జగదీశ్వరరావు, దయానంద్, హరి, అర్చకులు సంతోశ్ దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. శివాలయంలో గ్రిల్స్, రంగులు వేయించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

దిమిలిలో ఘనంగా బురదమాంబ ఉత్సవం



వేపకొమ్మలు పట్టుకొని బురదలో ముంచి చల్లుకుంటున్న యువత

రాంబిల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమిలి గ్రామంలో మంగళవారం బురదమాంబ అమ్మవారి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. తమ మొక్కులను తీర్చుకున్నారు. భక్తులు చిన్న, పెద్ద తేడా లేకుండా వేపకొమ్మ చేతబూని బురదను వంటికి పూసుకున్నారు. వేపకొమ్మలతో బురదను ఒకరిపై ఒకరు చల్లుకొని గ్రామ పురవీధుల్లో కేరింతలు కొడుతూ ఉత్సవాన్ని నిర్వహించారు.


రేపు జంగులూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని జంగులూరు గ్రామంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ పనుల్లో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

అచ్యుతాపురం మండలంలో..

అచ్యుతాపురం మండలంలో గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె రాజశేఖర్, అచ్యుతాపురం ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనుల కోసం రామన్నపాలెం, మడుతూరు, పెదపాడు, ఖాజీపాలెంలకు గురువారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

'రోలుగుంట సూరి'కి సత్కారం



సినీ నటుడు తొప్ప శ్రీనుని సత్కరిస్తున్న కూటమి నాయకులు

పాయకరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల విడుదలైన రోలుగుంట సినిమాలో విలన్‌గా నటించిన నక్కపల్లి మండలం ముకుందరాజుపేటకు చెందిన తొప్ప శ్రీనుని కూటమి నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. స్థానిక చిత్ర మందిర్ థియేటర్ ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సినీ నటుడు తొప్ప శ్రీనుని రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు చించెలపు ప్రదీప్, పట్టణ పార్టీ అధ్యక్షుడు యాళ్ల వరహాలు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియంకేరి తదితరులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, పార్టీ నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీవిశ్వనాథం, కురందాసు నూకరాజు, ఎం.రమాకుమారి, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

23న చీడికాడలో జాబ్ మేళా

దేవరాపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చీడికాడలో ఈనెల 23న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాకు 26 కంపెనీల ప్రతినిధులు హాజరవుతాయన్నారు.

మాదక ద్రవ్యాల అడ్డుకట్టకు పటిష్ఠ చర్యలు

» ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్



మునగపాకలో జరిగిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న సుందరపు విజయకుమార్, ప్రగడ నాగేశ్వరరావు, కూటమి నాయకులు

మునగపాక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మాదక ద్రవ్యాల అడ్డుకట్టకు కూటమి ప్రభుత్వం పటిష్ఠ చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. విశాఖ రేంజ్ స్థాయిలో పోలీస్ శాఖ చేపట్టిన అవగాహన సైకిల్ యాత్ర మంగళవారం మునగపాక చేరుకుంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వ్యాపారులు విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేస్తున్నారన్నారు. రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ గంజాయి వంటి మత్తుపదార్థాలు, డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ ధనుంజయరావు, ఎస్ఐ పి.వరప్రసాద్, గవర, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు భీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్క నాగభూషణం, ఎంఈఓ శివరెడ్డినాయుడు, కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువత అప్రమత్తంగా ఉండాలి : సీఐ

అచ్యుతాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా యువత అప్రమత్తంగా ఉండాలని సీఐ ఆర్‌వీఎస్ఎస్ చంద్రశేఖర్ అన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిర్మూలనే ధ్యేయంగా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు అభ్యుదయం పేరుతో పోలీస్ శాఖ చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం సాయంత్రం అచ్యుతాపురం చేరుకుంది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల కయవిక్రయాలు జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈకార్యక్రమంలో డీటీ శ్యామ్ కుమార్, ఎంపీడీఓ చిన్నారావు, వైద్యాధికారి శ్రావ్య తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి గృహాల పూర్తికి ప్రభుత్వ సాయం

» టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్



విలేకర్లతో మాట్లాడుతున్న కొప్పిశెట్టి వెంకటేశ్, టీడీపీ నేతలు

నక్కపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా వున్న గృహాలను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనంగా ప్రతి ఇంటికి రూ.50వేలు మంజూరు చేస్తోందని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగపర్చుకోవాలని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్ చెప్పారు. మంగళవారం రాత్రి స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2029 వరకూ గృహాలు నిర్మించుకునే లబ్ధిదారులు తమ వివరాలను సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికి పీఎంఈవై ద్వారా రూ.1.20లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ. 50వేలు వస్తాయని చెప్పారు. ఈనెల చివరి వరకూ నమోదు చేసుకుని ఇళ్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అన్ని గ్రామాల్లో హౌసింగ్‌పై కూటమి నాయకులు అవగాహన కల్పించాలని హోం మంత్రి అనిత ఆదేశించారని చెప్పారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, నెల్లిపూడి సర్పంచ్ సురేశ్ వర్మ, దార్ల కృష్ణ, కొండబాబు, గరికిన నూకరాజు పాల్గొన్నారు.

పార్టీ కమిటీల జాబితాలు త్వరగా ఇవ్వాలి

» టీడీపీ శ్రేణులకు నాయకులు విజ్ఞప్తి



పాయకరావుపేటలో జరుగుతున్న టీడీపీ కార్యకర్తల సమావేశం

పాయకరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పార్టీ కమిటీలు త్వరితగతిన పూర్తిచేసేందుకు జాబితాలు త్వరగా ఇవ్వాలని టీడీపీ మండల అధ్యక్షులు చించెలపు ప్రదీప్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు యాళ్ల వరహాలబాబు పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయడంతో పాటు గ్రామ స్థాయిలో పార్టీ మరింత బలోపేతం చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం మండల పార్టీ అధ్యక్షులు ప్రదీప్ మాట్లాడుతూ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా మండల, గ్రామస్థాయి నాయకులు మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ,బూత్ కమిటీలు త్వరితగతిన పూర్తిచేసి జాబితాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేశ్, నాయకులు పెదిరెడ్డి శ్రీను, కంకి పాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీవిశ్వనాథం, చిక్కాల శ్రీను, మజ్జూరి నారా యణరావు, పల్లా విలియంకేరి, గూటూరు శ్రీను, ఎం.రమాకుమారి పాల్గొన్నారు.

చెరువు స్థలం ఆక్రమణను అడ్డుకోండి

» ఉన్నతాధికారులకు పెదపల్లి గ్రామస్థుల వినతి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న గ్రామస్థులు

ఎలమంచిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి):మునిసిపాలిటీలోని పెదపల్లి, మంత్రిపాలెం, పెద గొల్లలపాలెం ప్రాంతాలకు చెందిన చెరువు స్థలం ఆక్రమణకు గురికాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పెదపల్లి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్థులు కోరుతున్నారు. మంగళవారం పెదపల్లిలోని అమ్మవారి ఆలయ ఆవరణలో వారు విలేకర్లతో మాట్లాడారు. పూర్వపు రెవెన్యూ రికార్డులు ప్రకారం చెరువు స్థలం ఆక్రమణకు గురికాకుండా ఉన్నతాధికారులు పరిరక్షించాలన్నారు.

గ్రామ మాజీ సర్పంచ్ కోడిగుడ్డు రమణబాబు, దాసరి కుమార్, బొద్దపు శ్రీను, తదితరులంతా మాట్లాడుతూ చెరువు స్థలాన్ని పరిరక్షించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలన్నారు. ఇప్పటికే అధికారుల పరిశీలనలో ఉంచామని, ఉన్నతాధికారులు పక్కాగా పరిశీలన చేయాలని కోరారు. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించేందుకు అవసరమైతే నిరాహారదీక్ష చేపడతామని గ్రామస్థులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దుంగా అచ్యుతరావు, మునిసిపల్ మాజీ కో-ఆప్షన్ మెంబరు బొద్దపు నాగేశ్వరరావు, నేతలు బొద్దపు శ్రీనివాసరావు, దంట్ల వెంకటస్వామి, యువకులు పాల్గొన్నారు.

యాజమాన్య హక్కు కల్పించడమే లక్ష్యం

» డీడీవో నాగలక్ష్మి



లింగాపురంలో గ్రామసభలో మాట్లాడుతున్న డీడీవో నాగలక్ష్మి

కోటవురట్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు, ఇళ్ల ఖాళీ స్థలాలకు యజమాన్య హక్కుపత్రాలు కల్పించేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు డీడీవో నాగలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని లింగాపురం, సుంకపూర్ గ్రామ సచివాలయాల వద్ద స్వమిత్వ గ్రామసభలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ యాజమాన్య హక్కులకు సంబంధించి ప్రాపర్టీ కార్డులు అందజేస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఇంటి పన్ను బకాయిలు నూరుశాతం వసూలు చేయాలని ఆదేశించారు. సచివాలయాల్లో సిబ్బంది సేవలు పెరిగాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, రఘురామ్, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారిత వీర్యంతో మేలు జాతి ఆడ పెయ్యిలు

» పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ శ్రీనివాసరావు



శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ సజ్జ శ్రీనివాసరావు

ఎస్.రాయవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారిత వీర్యం ద్వారా మేలు జాతి ఆడపెయ్యిలను ఎక్కువగా ఉత్పత్తి చేసి తద్వారా అధిక పాల దిగుబడి పొందవచ్చని ఉమ్మడి విశాఖ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ సజ్జ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వేమగిరిలో మంగళవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ వారి ఆర్థిక సాయంతో ఏర్పాటుచేసిన ఉచిత పశు గర్భకోశ చికిత్స శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు, రాయితీల గురించి వివరించారు. అలాగే పాడి పశువుల విషయంలో తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ నల్లల రామకృష్ణ, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం. చంద్రశేఖరరావు, స్థానిక సర్పంచ్, పశు వైద్యాధికారులు భరత్, వంశీకృష్ణ, సాయిశంకర్, సౌజన్య, వంశీకృష్ణయాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికల తయారీపై వెలుగు సిబ్బందికి శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు డీపీఎం వెంకటరమణ

నక్కపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఎనిమిది మండలాలకు చెందిన వెలుగు సిబ్బందికి 2026-27 వార్షిక ప్రణాళికల తయారీపై శిక్షణతరగతులు నిర్వహించారు. వెలుగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటరమణ, సెర్ప్ డీపీఎం వరప్రసాద్, ఏపీఎం కల్యాణి హాజరై పలుసూచనలు చేశారు. గ్రామ శాఖ అధ్యక్షులతో కలిపి, సిబ్బందిని సమన్వయపరచుకుని వార్షిక ప్రణాళికలు రూపొందించుకోవాలని చెప్పారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ శిక్షణ తరగతులను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, చీడికాడ, రావికమతం, రోలుగుంట, దేవరాపల్లి, కె.కోటపాడు, కశింకోట, పాయకరావుపేట మండలాల వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వరి పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

రాంబిల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరాపల్లి, కట్టుబోలు, రజాలలో వరి పొలాలను మంగళవారం వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.భవాని మాట్లాడుతూ ప్రస్తుత వరి పొలాల్లో మెడవిరుపు, పొడ తెగులు గమనించామన్నారు. మెడవిరుపు తెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ ఎకరాకు 120 గ్రాములు 200 లీటర్లకు కలిపి పొలం అంతా తడిచేటట్టు పిచికారీ చేయాలన్నారు. అక్కడక్కడ పాముతెగులు కూడా గమనించామని, దీనికి ప్రాపికొనజోల్ 200 మిల్లీలీటర్లు ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీటీ కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్‌రావు, ఏవో సి.సుమంత, ఏఈవో దేముడు, ఎంపీఈఓ రామారావు, వీఏఏ మేఘన, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



రజాలలో వరి పంట పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త భవాని



గ్రంథాలయ వారోత్సవాల్లో దేశభక్తి గీతాన్ని ఆలపిస్తున్న విద్యార్థి

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

» జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్

పాయకరావుపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ అన్నారు. మంగళవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులంతా గ్రంథాలయాల్లో పుస్తకాలు చదువుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు.అనంతరం నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు భగవద్గీత శ్లోకాలు, దేశభక్తి గీతాలు ఆలపించి అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వీ.రత్నం, ఎస్.సీతారామయ్య, ఎస్‌టీ.సీతారామమూర్తి, జగతా శ్రీధర్, వేముల వెంకటేశ్వరరావు, ఇంజరపు సూరిబాబు, ఐఎస్.మూర్తి, ఇన్‌చార్జి లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని పలు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి వి. ఆనంద్ పర్యవేక్షణలో విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

కోటవురట్ల గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. స్థానిక గ్రంథాలయాధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో విశ్రాంతి గ్రంథాలయ అధికారి మురళీకృష్ణ ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక జడ్పీ బాలికల ఉన్నతపాఠశాల, కేజీబీవీ పాఠశాల, ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు హాజరయ్యారు.

ఆర్‌బీకే పేరు మారలేదు..

» మారని అధికారులు తీరు



తెరువుపల్లిలో ఆర్‌బీకేకి మారని బోర్డు

ఎలమంచిలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో ప్రభుత్వ ఆదేశాలను అధికారులు పట్టించుకోవడం లేదు. రైతుభరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా ప్రభుత్వం మార్చింది. అయితే మునిసిపాలిటీలోని తెరువుపల్లిలో రైతు భరోసా కేంద్రం పేరు మార్చలేదు. ప్రభుత్వం మారి ఏడాదిన్నర కావస్తున్నా గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్నట్టే కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం అని దర్శనమిస్తున్నా సరే అధికారులు చర్యలు తీసుకోలేదు. ఈ బోర్డును చూస్తున్న ప్రతి ఒక్కరూ అధికారుల తీరును విమర్శిస్తున్నారు.

మావోల కదలికలపై పటిష్ఠ నిఘా

... 5వ పేజీ తరువాయి

అభిప్రాయపడ్డారు. సైబర్ మోసాల విషయంలో ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని అని ఎవరైనా చెబితే నమ్మవద్దని అన్నారు. డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని, అటువంటి ఫోన్ కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు, సైబర్ నేరాల టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని డీఐజీ సూచించారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులకు సంబంధించి 14 మందికి చెందిన ఆస్తులను సీజ్‌చేసినట్టు చెప్పారు. గంజాయి రవాణా కట్టడి కోసం ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు, ఇన్‌ఫార్మర్లు, డ్రోన్లు సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. ఆయన వెంట ఎస్పీ తుహిన్‌సిన్హా, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు వున్నారు.

నేడు రైతులకు పెట్టుబడి సాయం

... 5వ పేజీ తరువాయి

రైతులకు రూ.14.6 కోట్లు, చోడవరం నియోజకవర్గంలో 39,213 మంది రైతులకు రూ.33.5 కోట్లు, మాడుగులలో 35,065 మందికి రూ.29.7 కోట్లు, నర్సీపట్నంలో 28,017 మందికి రూ.23.1 కోట్లు, పాయకరావుపేటలో 29,645 మందికి రూ.25.6 కోట్లు, ఎలమంచిలిలో 24,859 మందికి రూ.21.9 కోట్లు, పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని సబ్బవరం, పరవాడ మండలాల్లో 11,941 మంది రైతులకు రూ.10.1 కోట్లు అందనున్నాయి. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులను ఆర్థికంగా ఆదుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రెండో విడత నిధులు విడుదల చేయడం సంతోషంగా వుందని పలువురురైతులు చెబుతున్నారు.

సబ్బవరంలో సభ

అన్నదాత సుఖీభవ 2వ విడత, పీఎం కిసాన్ 21వ విడత నిధుల విడుదల సందర్భంగా పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో బుధవారం మధ్యాహ్నం జిల్లాస్థాయి సభను ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎం.ఆశాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, కలెక్టర్ విజయకృష్ణన్, ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ హాజరవుతారని పేర్కొన్నారు.

పెట్రోలియం వర్సిటీ రెడీ

... 5వ పేజీ తరువాయి

రీసైక్లింగ్ చేసే టెక్నాలజీ, తరగతి గదులు, ఇతర హాల్స్‌లోకి వెంటిలేషన్ వచ్చేలా నిర్మాణాలు చేపట్టారు. దీనిపై వర్సిటీ అధికారులు మాట్లాడుతూ సెమిస్టర్ పరీక్షలు పూర్తయిన వెంటనే విద్యార్థులకు నాలుగు వారాలు సెలవులు ఉంటాయని, అనంతరం నేరుగా నూతన క్యాంపస్‌లోకి వస్తారన్నారు.

మావోయిస్టులకు గట్టి దెబ్బ

... 5వ పేజీ తరువాయి

పోలీసులు.. గ్రేహౌండ్స్ బలగాలతో మంగళవారం ఉదయం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మడివి హిడ్మా(45), అతని భార్య మడకం రాజే(40), డివిజన్ కమిటీ సభ్యులుగ లక్మల్ అలియాస్ చైతు(35), దేవ్(36), మల్ల అలియాస్ మల్లాలు(35), కమ్లు అలియాస్ కమలేష్(36) మృతి చెందారని పోలీసులు ధ్రువీకరించారు.

పోలీసులు అప్రమత్తం

మారేడుమిల్లి అడవుల్లో మావోయిస్టు అగ్ర నేతలు హిడ్మా, రాజీ తదితరులు ఎదురు కాల్పుల్లో మృతిచెందిన నేపథ్యంలో ఏవోబీలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ సంఘటనలో మరికొంతమంది తప్పించుకున్నారని నిఘా వర్గాల హెచ్చరికతో సరిహద్దుల్లోని సీలేరు, డొంకరాయి, మోతుగూడెం, జీకేవీధి పోలీసులతో పాటు ఒడిశాలోని పలు పోలీస్ స్టేషన్లను ఉన్నతాధికారులు అప్రమత్తం చేశారు. దీంతో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.



కంటి వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

ఎన్టీఆర్ వైద్యాలయంలో అధునాతన పరికరాలు

» రోగులకు మెరుగైన సేవలు: ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యాలయంలో అధునాతనమైన పరికరాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చెప్పారు. ఎన్టీఆర్ వైద్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సదరం శిబిరాన్ని పరిశీలించి దివ్యాంగులకు భరోసా కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యాలయంలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. వైద్యాలయంలో సిటీ స్కాన్ ఏర్పాటు చేశామని, డయాలసిస్ యూనిట్‌ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. నెఫ్రాలజీకి సంబంధించి వెయింటింగ్ లిస్టు ఎక్కువగా ఉండకుండా త్వరతగతిన వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఐదేళ్లలో జిల్లా ఆసుపత్రి 400 బెడ్ల ఆసుపత్రిగా రూపొందించాలనే ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పింఛన్ అర్హత ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు ప్రతి రోజూ 30 నుంచి 40 మందికి స్లాట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, వైద్యాలయం అభివృద్ధి కమిటీ సభ్యులు ఆళ్ల రామచంద్రరావు, తాడి శాంతికుమారి, డీడీ నాయుడు, నూకాంబిక ఆలయ చైర్మన్ పీలా నాగశ్రీను పాల్గొన్నారు.

భక్తకవి కనకదాసు జయంతి



కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసిన పోలీసులు

అనకాపల్లి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం భక్తకవి కనకదాసు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్బీ-2 ఇన్‌స్పెక్టర్ లక్ష్మి భక్తకవి కనకదాసు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సామాజిక సమానత్వం, భక్తి మార్గం, నైతికత, మానవత విలువలను ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప కవి కనకదాసు అని అన్నారు. కనకదాసు బోధనలు అన్వయించుకునేలా ఉండడంతో ప్రభుత్వ సిబ్బంది, యువత ఆయన ఆలోచనలను ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నూరుపాలెంలో ఆధార్ కేంద్రం



కేంద్రంలో పిల్లలకు ఆధార్ నమోదు చేస్తున్న దృశ్యం

కశింకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నూరుపాలెం గ్రామంలో మంగళవారం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తెలుగుయువత మండల ప్రధాన కార్యదర్శి కూండ్రపు ప్రదీప్ ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార కేంద్రం లేకపోవడంతో గ్రామస్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ సమస్యలను కలెక్టర్ విజయకృష్ణన్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆమె సానుకూలంగా స్పందించి వెంటనే ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రధానంగా విద్యార్థులకు బయోమెట్రిక్ సమస్య లేకుండా ఈ కేంద్రం సేవలు అందిస్తుందని, ఈ అవకాశాన్ని గ్రామస్థులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

పరవాడ చేరుకున్న అభ్యుదయ సైకిల్ యాత్ర

పరవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు సాగుతున్న అభ్యుదయ సైకిల్ యాత్ర మంగళవారం రాత్రి పరవాడకు చేరుకుంది. స్థానిక సినిమాహాల్ జంక్షన్ వద్ద సీఐ ఆర్.మల్లికార్జునరావు సిబ్బందితో ఘన స్వాగతం పలికారు. 25 మంది పోలీసు సిబ్బంది ఈ యాత్రలో పాల్గొని గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రజలను చైతన్యవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు భీమరాజు, కల్యాణరాజు, మహాలక్ష్మి, ట్రైనీ ఎస్ఐ విజయకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు వాడచీపురుపల్లి విద్యార్థి



అభిరామ్‌ను అభినందిస్తున్న హెచ్ఎం శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు

పరవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాపట్లలో ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు వాడచీపురుపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి అభిరామ్ ఎంపికయ్యాడు. ఇటీవల భీమిలిలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాల స్కూల్‌గేమ్స్ యోగా అండర్-17 పోటీల్లో అభిరామ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడు. ఈ సందర్భంగా అభిరామ్‌ను హెచ్ఎం ఎన్.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్.వెంకటరావు, ఎన్.సన్యాసిరావు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు

సబ్బవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదగొల్లలపాలెం సర్వే నంబరు 249 గెడ్డ వాగు/ప్రభుత్వ భూమిలో మంగళవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ బి.చిన్నికృష్ణ మాట్లాడుతూ గెడ్డవాగులో పక్కా నిర్మాణాలు సాగిస్తున్నట్టు సమాచారం అందిందని చెప్పారు. ఈ మేరకు ఆర్ఐ వీరయ్య, వీఆర్వో దేముడుబాబులతో మంగళవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయించామన్నారు. ఈ బోర్డును తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మతిస్థిమితం లేని వ్యక్తుల జాడ తెలపండి

అనకాపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం కోల్పోయి రోడ్లపై తిరుగుతున్న వారి జాడ తమకు అందిస్తే ఆసుపత్రికి తరలించడానికి చర్యలు తీసుకుంటామని మనోబంధు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం సాయంత్రం జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్సీ మాట్లాడుతూ మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారు తమను ఆదరించే వారు లేక నిరాశ్రయులై రోడ్లపై తిరుగుతున్నారని చెప్పారు. వారికి సహాయ సహకారాలు అందించేందుకు మనోబంధు ఫౌండేషన్ ప్రతినిధులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ డాక్టర్ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టు పై నుంచి జారి పడి కూలీ మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

కొత్తూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెట్టు ఎక్కి కొబ్బరికాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పడిన సంఘటనలో రోజువారీ కూలీ మృతి చెందాడని అనకాపల్లి రూరల్ ఏఎస్ఐ భూలోకరావు మంగళవారం తెలిపారు. కశింకోట గ్రామానికి చెందిన కొత్తం నాగేశ్వరరావు (46) కొబ్బరి కాయలు తీసేందుకు అనకాపల్లి మండలం సంపతిపురం గ్రామానికి పని నిమిత్తం వెళ్లాడన్నారు. అక్కడ చెట్టు ఎక్కి కొబ్బరికాయలు కోస్తుండగా కింద పడి తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. వెంటనే కుటుంబ సభ్యులు అనకాపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారని, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఏఎస్ఐ తెలిపారు. నాగేశ్వరరావుకు భార్య మంగ, కుమారుడు నరేశ్ ఉన్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

చంద్రబాబు పాలనలో రాష్ట్ర పురోభివృద్ధి

» అనుబంధ కమిటీ ప్రమాణ స్వీకారంలో విప్ చిరంజీవిరావు



మాట్లాడుతున్న చిరంజీవిరావు.. పక్కన దాడి వీరభద్రరావు, తాతయ్యబాబు

తుమ్మపాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్రం పురోభివృద్ధి చెందుతున్నదని ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన టీడీపీ అనుబంధ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అలాగే కార్యకర్తలను అన్ని రకాలుగా ఆదుకునేందుకు పార్టీ అధిష్ఠానం సమాలోచన చేస్తున్నదన్నారు. ఇందులో భాగంగా కార్యకర్తలు తమ కాళ్లపై నిలబడేలా చేయూతనిచ్చేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. వివిధ రకాల వ్యాపారాల నిర్వహణ కోసం రుణాలను మంజూరు చేయనున్నట్టు చెప్పారు. రూ.10 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణాలను అందించనున్నామని ఆయన తెలిపారు. ఇందులో 35 శాతం ప్రభుత్వం రాయితీగా అందించనుండగా, 65 శాతం లబ్ధిదారుడు వాటాలో బ్యాంకు రుణాలు మంజూరు చేయనున్నట్టు చెప్పారు. దీనికి సంబంధించి క్షేత్రస్థాయిలో ప్రణాళిక సిద్ధమవుతుందన్నారు. అలాగే పార్టీలో కష్టపడే వారికి సముచిత స్థానం కల్పించడంతో పాటు పదవులను అందించనున్నామన్నారు. కార్యకర్తలంతా ఆర్థికంగా ఎదిగేందుకు పార్టీ దోహదపడనుందన్నారు. ప్రతి ఒక్కరూ న్యాయబద్ధంగాను, చట్టబద్ధంగాను సంపాదించే ప్రయత్నం చేయాలన్నారు. గత ప్రభుత్వ పాలనలో దోచుకోవడం, దాచుకోవడమే పనిగా నాయకులు పనిచేశారని, అలాంటి ధోరణి టీడీపీ కార్యకర్తలకు ఉండదని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణ కలిగిన ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ పేదలను ఆదుకోవడమే లక్ష్యంగా టీడీపీ ఆవిర్భవించిందని చెప్పారు. ఎన్టీఆర్ సారథ్యంలో మొట్టమొదట సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. పార్టీలో కష్టపడే వారికి అండగా ఉండేందుకు పార్టీ నాయకత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సుపరిపాలనను ప్రజల ముందుకు తీసుకువెళ్లే బాధ్యత కార్యకర్తలు చేపట్టాలన్నారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని కోరారు. గ్రామాల అభివృద్ధిలో, సంక్షేమ పథకాల అమలులో కార్యకర్తల పాత్ర కచ్చితంగా ఉండాలని సూచించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడిగా కర్రి వెంకట సన్యాసినాయుడు, ప్రధాన కార్యదర్శిగా నంబారి శ్రీనుతో పాటు అనుబంధ కమిటీల నాయకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, డీసీఎంఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

నూకాంబిక అమ్మవారిని రాష్ట్ర ప్రభుత్వ విప్ చిరంజీవిరావు మంగళవారం దర్శించుకున్నారు. ఆయనతో పాటు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ మండపంలో వీరికి పురోహితులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు. ఆలయ ధర్మకర్తలు ఎం.శంకరరావు, ఎస్.సతీశ్ పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు సత్వర చర్యలు

» యువత ఉపాధి కల్పనకు కృషి: ఎమ్మెల్యే పంచకర్ల



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పరవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీ నుంచి వెదజల్లుతున్న కాలుష్యం నివారణకు సత్వరమే చర్యలు చేపడతామని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు స్పష్టం చేశారు. అలాగే గ్రామాల్లో నిరుద్యోగ యువత ఉపాధి కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మన పల్లెకు-మన ఎమ్మెల్యే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, వాడచీపురుపల్లి, తిక్కవానిపాలెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా ఎన్టీపీసీ, ఫార్మాసిటీల్లో ఉపాధి కల్పించాలని, ఆయా పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని నివారించాలని గ్రామస్థులు కోరారు. తొందరలోనే ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే ముత్యాలమ్మపాలెంలో 43 మంది మత్స్యకారులకు ప్రభుత్వం రూ.2.15 కోట్లతో సమకూర్చిన వేటకు సంబంధించిన పరికరాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. గ్రామాల్లో కమ్యూనిటీ హాళ్లు, సీసీ రోడ్ల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.నాగరాజు, ఎంపీడీవో పి.రమేశ్‌నాయుడు, సర్పంచులు చింతకాయల సుజాత, శివలంక లక్ష్మి, చేపల మసేను, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, ఎం.అప్పలనాయుడు, పాల్గొన్నారు.

దేశపాత్రునిపాలెంలో గ్రావెల్ తవ్వకాలు చేపట్టొద్దు

» ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్థుల స్పష్టం

» పర్యావరణం దెబ్బతింటుందని ఆందోళన



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న దేశపాత్రునిపాలెం గ్రామస్థులు

పరవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'గ్రావెల్ తవ్వకాలకు మేమంతా వ్యతిరేకం. ఇక్కడ ఎట్టి పరిస్థితుల్లోనూ తవ్వకాలు జరపొద్దు' అని జీవీఎంసీ 79వ వార్డు పరిధిలోని దేశపాత్రునిపాలెం గ్రామస్థులు ముక్త కంఠంతో తేల్చి చెప్పారు. దేశపాత్రునిపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 334లోని 9.709 హెక్టార్ల విస్తీర్ణంలో 10,416 క్యూబిక్ మీటర్ల బిల్డింగ్ స్టోన్, రెండు లక్షల 50 వేల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ తవ్వకాల కోసం లక్ష్మీనరసింహ మినరల్స్ సంస్థ ప్రభుత్వానికి అనుమతి కోరింది. ఈ సంస్థకు అనుమతులు ఇవ్వాలా... ఒద్దా తెలుసుకునేందుకు ఆర్డీవో షేక్ ఆయిషా ఆధ్వర్యంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో దేశపాత్రునిపాలెం శివాలయం సమీపంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థుల అభిప్రాయాలను ఆర్డీవో కోరగా, వారు పై విధంగా స్పందించారు. గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇస్తే భూగర్భ జలాలు నాశనమయ్యే ప్రమాదం ఉందని, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడే తవ్వకాలు చేపట్ట వద్దని ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ, దేశపాత్రునిపాలెం మాజీ ఉప సర్పంచ్ వీవీ రమణ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, సీపీఎం నాయకుడు పీడీ నాయుడు గ్రావెల క్వారీ అనుమతులకు వ్యతిరేకంగా మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ క్వారీ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వొద్దని డిమాండ్ చేశారు.

ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఈ సందర్భంగా ఆర్డీవో అయిషా స్పష్టం చేశారు. అనంతరం గ్రామస్థులు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ పీవీ ముకుందరావు, రెవెన్యూ ఉద్యోగులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

పరవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో సామాజిక భవనం వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఫైజర్ సంస్థ ప్రతినిధి బి.మురళీధర్ ప్రారంభించారు. వైద్యులు శ్రీలక్ష్మి, అపూర్వ, పవన్ రోగులకు కంటి పరీక్షలు చేసి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. అలాగే 350 మందికి కంటి అద్దాలు అందజేశారు. 40 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్ జనరల్ మేనేజర్ కె.బంగార్రాజు పాల్గొన్నారు.

నానో యూరియాపై రైతులకు శిక్షణ

కొత్తూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తగరంపూడి గ్రామంలో మంగళవారం నానో యూరియాపై రైతులకు శిక్షణ ఇచ్చారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఏటీఎం పి.రామకృష్ణ మాట్లాడుతూ ఎకరాకు 500 మిల్లీ లీటర్ల చొప్పున నానో యూరియా స్ప్రే చేసుకోవాలన్నారు. దీని వల్ల వరి పొలం పైరు పచ్చగా ఉండడమే కాకుండా ఏపుగా పెరుగుతుందన్నారు. నానో యూరియా వాడడం వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అనంతరం పంట నమోదు, సోషల్ ఆడిట్ పేర్లు రైతులకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి అప్పారావు, బీజేపీ నాయకులు కప్పిరి తాతారావు, వ్యవసాయ సిబ్బంది మజ్జి సత్యారావు, వెంకటరమణ, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ నేత గోపీ జన్మదిన వేడుకలు

కశింకోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు వేగి గోపీకృష్ణ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అనకాపల్లి పట్టణంలో జరిగిన టీడీపీ సమావేశంలో గోపీకృష్ణకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవిరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, మండల అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు తదితరులు కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాండ్రేగుల సతీష్, నంబారు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రత అందరి బాధ్యత

సబ్బవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రతను అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీవో పి.పద్మజ కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల పరిశుభ్రత కోసం శతశాతం ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలన్నారు. చేతి సంచిపై మహిళలకు అవగాహన కల్పిస్తే, ప్లాస్టిక్ నిషేధంలో కొంత పురోగతి ఉంటుందన్నారు. మరుగుదొడ్ల శతశాతం వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. పచ్చదనం కోసం విరివిగా మొక్కలు నాటాలని కోరారు. ఏవో పీవీ.పంతులు, ప్రజా ప్రతినిధులు బోకం రామునాయుడు, ఎస్.నారాయణమూర్తి, దెడ్డం ప్రసాదరావు, బండారు శ్రీను, పడాల వెంకటరమణ, పంచాయతీ కారదర్శులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టిసారించండి

» అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

» జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారిణి సూర్యలక్ష్మి



మల్లునాయుడుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ అధికారి సూర్యలక్ష్మి

సబ్బవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారిణి ఎన్.సూర్యలక్ష్మి ఆదేశించారు. మండలంలోని మల్లునాయుడుపాలెం-1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలతో మాట్లాడుతూ తల్లులు ఎప్పుడూ హిమోగ్లోబిన్ 12 శాతం తగ్గకుండా చూసుకోవాలన్నారు. ఆహారంలో మునగాకు అధికంగా తీసుకోవాలని సూచించారు. ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం తప్పనిసరని ఆమె స్పష్టం చేశారు. పిల్లల భద్రత కోసం హెల్ప్‌లైన్ నంబరు 1098, మహిళల భద్రత, సంరక్షణ కోసం 181-100 నంబర్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో తప్పనిసరిగా మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. పిల్లల బరువు ఎప్పటికప్పుడు చూస్తూ రికార్డు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు డి.అప్పలనర్సమ్మ, వై.ఇందిర, సుభాషిణి, రమణమ్మ, అక్కమ్మ, ఆర్పీ దేముడమ్మ, జగదేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సురేంద్రను కలిసిన ఎన్ఆర్ఐ రాపేటి

అనకాపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రను ఎన్ఆర్ఐ, టీడీపీ దుబాయ్ గవర సోషల్ మీడియా కన్వీనర్ రాపేటి సంతోశ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు నర్సీపట్నం నియోజకవర్గం బీసీ యువ నేత ఆదాపురెడ్డి రాజేశ్ కూడా సురేంద్రను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ అధికారంలో లేని సమయంలో సోషల్ మీడియా ద్వారా వైసీపీ ప్రభుత్వంలో జరిగిన తప్పులను ప్రజలకు తెలిసేలా రాపేటి సంతోశ్ కృషి చేశారని ఈ సందర్భంగా సురేంద్ర చెప్పారు.

వ్యాసరచన పోటీలు

సబ్బవరం: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'నాకు నచ్చిన పుస్తకం', 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర' అనే అంశాలపై ఈ పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు వారోత్సవాల చివరి రోజున బహుమతులు అందిస్తామని ఈ సందర్భంగా గ్రంథాలయాధికారిణి వి.శిరీష తెలిపారు.

కశింకోటలో...

కశింకోట: తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 43 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా విద్యార్థినులకు రంగవల్లి, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహిస్తామని గ్రంథాలయాధికారి జగన్నాథం తెలిపారు.

తెలుగుయువత మండల అధ్యక్షుడిగా నరసింగరావు



నరసింగరావు

అనకాపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలుగు యువత అనకాపల్లి మండల అధ్యక్షుడిగా చందక నరసింగరావు (నర్సింగ్) నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. 2019 నుంచి నరసింగరావు తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఇటీవల పార్టీ నియామకాల్లో అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తానని, పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో గ్లోబల్ విద్యార్థుల ప్రతిభ

పరవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫిన్ స్విమ్మింగ్ పోటీల్లో మండలంలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వివిధ విభాగాల్లో వారు పతకాలు సాధించారు. మొత్తం 12 మంది విద్యార్థులు పాల్గొని బంగారు, రజిత పతకాలు సాధించినట్టు పాఠశాల స్పోర్ట్స్ డైరెక్టర్ జి.మధుబాబు తెలిపారు. పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్ అభినందించారు.

ఘనంగా మహా రుద్రాభిషేకం

అనకాపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గౌరీ పంచాయతన ఆలయంలోని కర్రి రమేశ్ కళావేదిక ప్రాంగణంలో మంగళవారం రాత్రి మహాన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం భక్తిశ్రద్ధలతో జరిగింది. అర్చకులు గోపాలకృష్ణశర్మ, సూర్యనారాయణశాస్త్రి వేదమంత్రాల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో వర్తక సంఘం కార్యదర్శి కొణతాల లక్ష్మీనారాయణ దంపతులు, జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి దంపతులు కూర్చొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీశ్ పాల్గొన్నారు.

నేడు అన్నదాత సుఖీభవపై సభ

సబ్బవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ నిధుల విడుదలకు సంబంధించి బుధవారం రైతులతో బహిరంగ సభ జరుగుతుందని పీఆర్‌వో ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరగనున్న ఈ సభకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ హాజరవుతారని చెప్పారు. జిల్లాలో అన్నదాత సుఖీభవ లబ్ధిదారులు ఈ కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

తెలుగుభాష రక్షణ సమితి వార్షికోత్సవం

అనకాపల్లి టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక హిమశేఖర్ కళాశాలలో మంగళవారం తెలుగు భాష పరిరక్షణ సమితి తృతీయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు సాహిత్య ప్రియులు కోరుకొండ బుచ్చిరాజు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తెలుగు భాష పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కథల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రముఖ కవి కె.శేషగిరిరావు పక్షిని కవితలు చదివి వినిపించారు. కార్యక్రమంలో తెలుగు భాష పరిరక్షణ సమితి అధ్యక్షుడు కె.రామ్మోహనరావు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్ల సంఘం జిల్లా కమిటీ ఏకగ్రీవం

» అధ్యక్షుడిగా కె.ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు


కె.ప్రభాకరరావు


ఎ.నాగరాజు

పాడేరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరా విభాగం కాంట్రాక్టర్ల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక మంగళవారం స్థానిక మోదకొండమ్మ కల్యాణ మండపంలో ఏకగ్రీవంగా జరిగింది. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా డి.అయ్యప్పరెడ్డి, అధ్యక్షుడిగా కె.ప్రభాకర రావు, ప్రధాన కార్యదర్శిగా ఎ.నాగరాజు, కోశాధికారిగా బి.అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా పి.వీరబాబు, వీఎన్ చైతన్య, కార్యదర్శులుగా పి.నాగరాజు, కె.రాజుబాబు, సంయుక్తకార్యదర్శులుగా బి.చలపతి, ఎస్.రామారావులతో పాటు మరో పది మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు


విద్యార్థినుల అస్వస్థతపై హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్లతో మాట్లాడుతున్న కృష్ణారావు

కొయ్యూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల ఆ రోగ్యంపై నిర్లక్ష్యం వహించి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దని బీజేపీ పాడేరు నియోజక వర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్ కూడా కృష్ణారావు హెచ్చరించారు. మండలంలో రాజేంద్రపాలెం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురై స్థానిక పీహెచ్‌సీలో ఉన్న విద్యార్థినులను ఆయన మంగళవారం పరామర్శించి వారి ఆరోగ్య స్థితిగతులపైఆరా తీశారు. అనంతరం పాఠశాలకు వెళ్లి ఘటనకు కారణాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

అనంతరం ఆయన స్థానిక హౌసింగ్ ఏఈ కార్యాలయాన్ని కృష్ణారావు సందర్శించారు. ఈ సందర్భంగా పీఎం జన్‌మన్ ఇళ్ల నిర్మాణాలు ఏయే దశల్లో ఉన్నాయో వర్క్ ఇన్స్‌పెక్టరు గోవిందును అడిగి తెలుసుకున్నారు. అనంతరం గోకులాల వివరాలను పశు వైద్యాధికారి రాజేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ ప్రధాన కార్యదర్శి పద్మరాజు, గిరిజనమోర్చా జిల్లా అధ్యక్షుడు రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ చంద్ర రావు, నేతలు చక్రరావు, ఉష, సత్యనారాయణ, త్రినాథ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతంలో ఆరుతడి పంటల సాగు

» సబ్ డివిజన్ పరిధిలో తొలిసారిగా 500 ఎకరాల్లో వేరుశనగ, 900 ఎ కరాల్లో అపరాలు

» 90శాతం రాయితీపై విత్తనాలు: ఏడీఏ తిరుమలరావు


వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ బీవీ తిరుమలరావు

చింతపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో తొలిసారిగా ఆరుతడి పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్టు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీఏ) బీవీ తిరుమలరావు తెలిపారు. మంగళవారం తాజంగి గ్రామంలో ఆదివాసీ రైతులకు 90శాతం రాయితీపై వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలపై రైతులతో వేరుశనగ, అపరాల పంటలు సాగు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. తాజంగిలో ప్రథమంగా వేరుశనగ సాగు రైతులు చేపడుతున్నారన్నారు. 90శాతం రాయితీపై వేరుశనగ, అపరాలు పంటలుగా మినుములు, పెసలు విత్తనాలు రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి మండలాల్లో 500 ఎకరాల్లో వేరుశనగ, 900 ఎకరాల్లో అపరాలు సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. సాగు విధానంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. గిరిజన రైతులు రబీలోను వ్యవసాయ పంటల ద్వారా అధిక ఆదాయం పొందాలన్నారు. సందేహాలను సకాలంలో నివృత్తి చేసేందుకు వ్యవసాయశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు టి. మధుసూదనరావు, గిరిబాబు, సర్పంచ్ మహేశ్వరి, నీటి సంఘం చైర్మన్ బోనంగి బాలయ్యపడాల్, జనసేన మండలాధ్యక్షుడు బుజ్జిబాబు, అగ్రికల్చర్ అసిస్టెంట్ అనురాధ పాల్గొన్నారు.

'జీవనోపాధిని దూరం చేయొద్దు'


పట్టాలు చూపుతున్న గిరిజన మహిళా రైతులు

చింతపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాఫీ తోటల మీదుగా రహదారి నిర్మించి తమ జీవనోపాధిని దూరం చేయవద్దని లంబసింగి జంక్షన్ ఆదివాసీ మహిళా రైతులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆదివాసీ మహిళా కాఫీ రైతులు విలేకరులతో మాట్లాడారు. లంబసింగి జంక్షన్ గ్రామంలో నివాసముంటున్న టొల్లల లక్ష్మి, పిట్ల రత్నకుమారి, కాకరి దేవి, చింత లక్ష్మి, చుక్కా సింహాచలంకి అరెకరం నుంచి 1.5ఎకరాల భూమి తాతల నుంచి వారసత్వంగా వచ్చింది. ఈ భూముల్లో మహిళా రైతులు 50ఏళ్లగా కాఫీ తోటలను సాగు చేసుకుంటున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో గుర్తు తెలియని వ్యక్తులు నలుగురు మహిళా రైతులకు చెందిన సుమారు వెయ్యి కాఫీ మొక్కలను వేర్లతో తొలగించారన్నారు. దీనిపై చింతపల్లి పోలీసులు, తహశీల్దార్, కలెక్టర్‌కి ఫిర్యాదు చేశామని, అయినా, స్పందలేకుండాపోయిందన్నారు. జలగలగెడ్డ గ్రామానికి పాడుబడ్డ బ్రిటీష్ అతిథి గృహం నుంచి కాలిబాట ఉందని, ఈ మార్గంలో రహదారి నిర్మిస్తే ఎవరికి నష్టం జరగదని మహిళా రైతులు తెలిపారు. ఈకార్యక్రమంలో బాధిత మహిళా రైతులతోపాటూ స్థానిక గిరిజనులు పాల్గొన్నారు.

ఏపీఎఫ్‌డీసీ ఎండీ హామీతో కాఫీ కార్మికుల సమ్మె విరమణ


మంగళగిరిలో ఏపీఎఫ్‌డీసీ ఎండీకి వినతి పత్రం అందజేస్తున్న కాఫీ కార్మికులు

చింతపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హామీతో తాత్కాలికంగా కాఫీ కార్మికులు సమ్మె విరమించినట్టు సీఐటీయూ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, సోమవారం సాయంత్రం సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నరసింగరావుతో కలిసి కాఫీ కార్మికులు ఏపీఎఫ్‌డీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎస్ శ్రీధర్‌ని మంగళగిరి కార్యాలయంలో కలిసినట్టు చెప్పారు. 12 రోజులుగా కాఫీ కార్మికులు సమ్మె చేపడుతున్న విషయం తన దృష్టికి రాలేదని మేనేజింగ్ డైరెక్టర్ ఈ సందర్భంగా తెలియజేయడంతో కాఫీ కార్మికులు విస్మయానికి గురయ్యారన్నారు. ఈ నేపథ్యంలో వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సమస్యలు పరిష్కారానికి కొంత సమయం కావాలని కోరారని, దీనికి కార్మికులు అంగీకరించారన్నారు. ఈనెల 30తేదీలోగా చింతపల్లి ఏపీఎఫ్‌డీసీ డివిజనల్ కార్యాలయంలో కాఫీ కార్మికులతో సమావేశం కావాలని ఎండీని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఈ నేపథ్యంలో బుధవారం నుంచి కాఫీ కార్మికులు పనులకు హాజరవుతారని తెలిపారు. కార్మిక సంఘం నాయకులు లింగేరి సుందరరావు, మోరి వెంకటగిరి, వెంకటేశ్, కనకవల్లి, కాంతమ్మ పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ పద్మ మృతి తీరని లోటు: గిడ్డి ఈశ్వరి

జి.మాడుగుల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత, మాజీ ఎంపీపీ కొర్రా పద్మ మృతి పార్టీకి తీరని లోటని పాడేరు నియోజక వర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. మాజీ ఎంపీపీ పద్మ అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారం స్వగ్రామం గానుగరోళ్లలో అంత్యక్రియలు నిర్వహించారు. గిడ్డి ఈశ్వరితో పాటు స్థానిక టీడీపీ నేతలు పాల్గొని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ఓదార్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అప్పలరాజు, నాయకులు వరహాలరాజు, గోవింద్ మాస్టారు, చిట్టిబాబు, కొండలరావు, కల్యాణం, భీంబాబు, కృష్ణమూర్తి,రెడ్డిబాబు, రామన్నదొర, పిన్నయ్యదొర లక్ష్మణరావు, నితిన్‌కుమార్ పాల్గొన్నారు.


పద్మ పార్థీవ దేహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

సచివాలయ సిబ్బందిని నియంత్రించండి

» హాజరు ఆధారంగా జీతాలు చెల్లించండి

» పెన్షన్ పంపిణీ తరువాత మిగిలిన సొమ్ము జమ చేయని సిబ్బంది నుంచి రికవరీ చేయండి

» అధికారులకు జడ్పీ సీఈవో నారాయణమూర్తి ఆదేశం


మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నారాయణ మూర్తి

పాడేరురూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పాడేరు డివిజన్‌లోని గ్రామ సచివాలయాల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై పలు ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో సిబ్బందిని నియంత్రించాలని ఎంపీడీవోలను జడ్పీ సీఈవో నారాయణమూర్తి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, గ్రామీణ నీటి సరఫరా సహాయక ఇంజనీర్లతో మంగళవారం ఆయన ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బందిని నియంత్రించవలసిన ఎంపీడీవోలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం విధిగా హాజరు నమోదు చేయాలని, హాజరు ఆధారంగా మాత్రమే జీతాలు చెల్లించాలని ఆదేశించారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌లు వారానికి రెండు సార్లు పాఠశాలల్లో మరుగుదొడ్లు తనిఖీ చేయాలన్నారు. ఆధార్ కిట్లు నిర్వహణకు సహకరించని డిజిటల్ అసిస్టెంట్‌లను గుర్తించి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం డివిజన్ వ్యాప్తంగా తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణ ప్రగతిని సమీక్షించారు. పెన్షన్ బట్వాడా తరువాత మిగిలిన సొమ్ము జమ చేయని సచివాలయ ఉద్యోగులపై కేసులు నమోదు చేసి ఆర్ఆర్ యాక్ట్ ప్రకారం రికవరీ చేయాలని ఆదేశించారు. చెత్త నుంచి సంపద కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని సూచించారు. గ్రామ సచివాలయ శాఖ జిల్లా నోడల్ అధికారి పీఎస్.కుమార్ మాట్లాడుతూ ఎంపీడీవోలు, మండల ప్రత్యేకాధికారులు ప్రతి వారం నాలుగు సచివాలయాలను తనిఖీ చేయాలన్నారు. కౌశలం సర్వే, ఈకేవైసీ తదితర పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని కోరారు. తల్లికి వందనం పథకం నగదు అందని కుటుంబాల బ్యాంక్ ఖాతాలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్‌కు లింక్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్ర కిరణ్, ఉపాధి హామీ ఏపీడీ సీతయ్య, డిఆర్‌డీఏ పీడీ మురళి, డీఎల్‌పీవో జయప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల కార్యవర్గం ఎన్నిక

డుంబ్రిగుడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల మండల అధ్యక్షుడిగా కిల్లో కామేశ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సంఘం ఎన్నికలను నిర్వహించారు. అన్ని పంచాయితీల ఫీల్డ్ అసిస్టెంట్లు కామేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తే సహించం'

డుంబ్రిగుడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఉపయోగపడుతున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తే సహించమని ఉపాధి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌బీ పోతురాజు హెచ్చరించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొత్త నిబంధనల పేరిట లబ్ధిదారులకు ఇబ్బందికి చేస్తున్నారని వాపోయారు. దీనివల్ల లక్షలాది మంది కూలీలు ఉపాధికి దూరమవుతున్నారనిచెప్పారు. వివిధ కారణాలతో దేశ వ్యాప్తంగా సుమారు 27 లక్షల మంది డేటానుంచి తొలగించగా, వీరిలో అధికంగా ఏపీలో 15 లక్షల మంది ఉన్నారన్నారు. అలాగే, బకాయి బిల్లులు చెల్లించాలన్నారు.

సైబర్ నేరగాళ్లపై అప్రమత్తం

అనంతగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ క్రైమ్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని అరకు సీఐ హిమగిరి సూచించారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల-1 పాఠశాలలో మంగళవారం మాదకద్రవ్యాలు, సైబర్‌క్రైమ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ. మాదకద్రవ్యాల నిరోధంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ వ్యసనంతో జీవితాలను నాశనం అవుతున్నాయన్నారు. అపరిచితులు ఫోన్‌కాల్స్ ద్వారా వ్యక్తిగత, బ్యాంక్ వివరాలు సేకరిస్తే సైబర్‌క్రైమ్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాజానాయుడు, ట్రైనీ ఆర్ఎస్ఐ లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కి మోసపోవద్దని స్థానిక సీఐ హిమగిరి అన్నారు. మంగళవారం కొత్తభల్లుగుడ టీడబ్ల్యూ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో విద్యార్థినులతో అవగాహన సమావేశం నిర్వహించారు. సైబర్‌నేరగాళ్లు పంపించే లింక్‌లను క్లిక్ చేయరాదని హెచ్చరించారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. ఎస్ఐ గోపాలరావు, హెచ్ఎం టి. పద్మావతి, డిప్యూటీ వార్డెన్ లక్ష్మి,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ హిమగిరి, సిబ్బంది

మాదక ద్రవ్యాల నిరోధానికి విద్యార్థులు సహకరించాలి

పాడేరురూరల్: గిరిజన గ్రామాల్లో మాదకద్రవ్యాల ప్రభావాన్ని అరికట్టేందుకు విద్యార్థులు కృషి చేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి అన్నారు. నషా ముక్త భారత్ అభియాన్ (ఎన్ఎంబీఏ) ఐదేళ్ల పూర్తయిన సందర్భంగా కళాశాల సెమినార్ హాల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎంబీఏ కో-ఆర్డినేటర్ డాక్టర్. డి.గణేష్, ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి:విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లరాదని ఈగల్ బృందం ఆర్ఎస్ఐ శ్రీరామమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు బ్రో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.


మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు


ప్లకార్డులతో ఆర్ఎస్ఐ శ్రీరామమూర్తి, ప్రిన్సిపాల్ విజయ భారతి, విద్యార్థులు

సందీప్‌రెడ్డి సేవలు అభినందనీయం: కలెక్టర్

» బదిలీపై ఏలూరు వెళుతున్న డీఎఫ్‌వో సందీప్‌రెడ్డికి ఘనంగా వీడ్కోలు


డీఎఫ్‌వో సందీప్‌రెడ్డికి వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): డివిజనల్ అటవీ అధికారిగా పీవీ సందీప్‌రెడ్డి సేవలు అభినందనీయమని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అన్నారు. ఇక్కడ డీఎఫ్‌వోగా పని చేస్తున్న ఆయనను తాజాగా ఏలూరుకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు వీడ్కోలు పలికేందుకు స్థానిక కాఫీ హౌస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ దినేశ్‌కుమార్ మాట్లాడారు. జిల్లాలో అడవుల సంరక్షణతోపాటు అగ్నిప్రమాదాల కారణంగా అడవులు నాశనం కాకుండా చూశారన్నారు. అలాగే అటవీ హక్కుల కల్పన, రోడ్ల నిర్మాణానికి అవసరమైన అటవీ అనుమతుల ప్రక్రియలను వేగవంతం చేయడం వంటి చర్యలతో జిల్లాలో అభివృద్ధికి ఆయన కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కలెక్టర్ దినేశ్‌కుమార్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం ఫారెస్ట్ కన్జర్వేటర్ బీఎం.దివాన్ మైదిన్, జిల్లాలోని సబ్ డీఎఫ్‌వోలు, అటవీ రేంజర్లు, డిప్యూటీ రేంజర్లు, సెక్షన్, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడిగా కాళేశ్వరరావు


గిరిజన ఉద్యోగుల సంఘం మండల కార్యవర్గం

గూడెంకొత్తవీధి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడిగా దొండ వెంకట కాళేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రాష్ట్ర ఉపాధ్యక్షుడు లోచలి రామకృష్ణ తెలిపారు. మంగళవార గిరిజన ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ గిరిజన ఉద్యోగులు అధ్యక్షుడితోపాటు ఉపాధ్యక్షులుగా చెరెకి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా కొర్రా మల్లేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా మర్రి సత్యనారాయణ, కోశాధికారిగా శ్రీరెడ్డి వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా పాతును రామరాజుని ఎన్నుకున్నారన్నారు. సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాగిన పూర్ణచంద్రరావు, మాజీ మండలాధ్యక్షుడు ముర్ల వెంకట రమణ, నేత ముక్కలి కామేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు

డుంబ్రిగుడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల పురస్కరించుకుని విద్యార్థులకు వివిధ ఆటలు, వ్యాసరచనలు, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలకు 20న బహుమతులు అందిస్తామని లైబ్రేరియన్ ఎస్.సునీత, సిబ్బంది సుబ్బారావు తెలిపారు.

చెత్తనుంచి సంపద కేంద్రాలతో ఆదాయం

» జడ్పీ సీఈవో నారాయణరావు


అనంతగిరిలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో, ఎంపీడీవో

అనంతగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో చెత్తనుంచి సంపద కేం ద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి సూచించారు. మండల కేంద్రంలో ఆయన మంగళవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరణపై ప్రజలకు అడిగితెలుసుకున్నారు. పారిశుధ్యంలో భాగంగా ఐవీఆర్ఎస్ ఫోన్‌కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం చెత్తసంపద కేంద్రానికి వెళ్లి పరిశీలించారు. తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని, తడిచెత్త ద్వారా కంపోస్టు తయారు చేయాలన్నారు. సంపద కేంద్రాలకు ఆదాయంపై దృష్టిసారించాలని కార్యదర్శులు, పారిశుధ్య కార్మికులకు సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో ప్లాస్టిక్ నిషేధాన్ని పక్కాగా అమలుచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్, డిప్యూటీ ఎంపీడీవో నరసింగ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గౌతమ్, కార్యదర్శి దేవా, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కల సాగుతో అదనపు ఆదాయం


మాట్లాడుతున్న రేంజర్ దేవి రాజేశ్వరి

పాడేరురూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఔషధ మొక్కల సాగు ద్వారా గిరిజన రైతులు ఆదనపు ఆదాయాన్ని పొందవచ్చని ఫారెస్టు రేంజర్ అధికారిణి దేవీ రాజేశ్వరి అన్నారు. అమృత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని నక్కలపుట్టు పంచాయతీ సేరుబయలు గ్రామంలోని జోడ్ల రిసోర్స్ సెంటర్‌లో రైతులకు నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. ఏపీ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు ప్రతినిధి విజయకుమార్ మాట్లాడుతూ మొక్కల సాగు, పండించిన ఉత్పత్తికి మార్కెటింగ్ అవకాశాలు తదితర వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎవపీబీ ప్రతినిధులు చిరంజీవి, అఖిల్, అమృత సంస్థ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ రవికుమార్, పట్నాయక్, రోస్‌మేరి, బాలకృష్ణ సునీల్, చిన్నమ్మ, 60 మంది రైతులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాడేరురూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాల వారోత్సవాలలో భా గంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు ఆటల పోటీలతో పాటు క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించినట్టు లైబ్రేరియన్ వి.మానస తెలిపారు. గత ఐదు రోజులుగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. విజేతలకు ఈ నెల 20న బహుమతులు అందజేస్తామన్నారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్.విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు ఎస్.కన్నయ్య, కె.రాధాకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

మావోల కదలికలపై పటిష్ఠ నిఘా

... 5వ పేజీ తరువాయి

అభిప్రాయపడ్డారు. సైబర్ మోసాల విషయంలో ప్రజలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని, పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని అని ఎవరైనా చెబితే నమ్మవద్దని అన్నారు. డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరాలుకు పాల్పడుతున్నారని, అటువంటి ఫోన్ కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు, సైబర్ నేరాల టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని డీఐజీ సూచించారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులకు సంబంధించి 14 మందికి చెందిన ఆస్తులను సీజ్‌చేసినట్టు చెప్పారు. గంజాయి రవాణా కట్టడి కోసం ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు, ఇన్‌ఫార్మర్లు, డ్రోన్లు సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు. ఆయన వెంట ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు వున్నారు.

నేడు రైతులకు పెట్టుబడి సాయం

... 5వ పేజీ తరువాయి

రైతులకు రూ.14.6 కోట్లు, చోడవరం నియోజకవర్గంలో 39,213 మంది రైతులకు రూ.33.5 కోట్లు, మాడుగులలో 35,065 మందికి రూ.29.7 కోట్లు, నర్సీపట్నంలో 28,017 మందికి రూ.23.1 కోట్లు, పాయకరావుపేటలో 29,645 మందికి రూ.25.6 కోట్లు, ఎలమంచిలిలో 24,859 మందికి రూ.21.9 కోట్లు, పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని సబ్బవరం, పరవాడ మండలాల్లో 11,941 మంది రైతులకు రూ.10.1 కోట్లు అందనున్నాయి. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతులను ఆర్థికంగా ఆదుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద రెండో విడత నిధులు విడుదల చేయడం సంతోషంగా వుందని పలువురురైతులు చెబుతున్నారు.

సబ్బవరంలో సభ

అన్నదాత సుఖీభవ 2వ విడత, పీఎం కిసాన్ 21వ విడత నిధుల విడుదల సందర్భంగా పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో బుధవారం మధ్యాహ్నం జిల్లాస్థాయి సభను ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి ఎం.ఆశాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, కలెక్టర్ విజయకృష్ణన్, ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ హాజరవుతారని పేర్కొన్నారు.

పెట్రోలియం వర్సిటీ రెడీ

... 5వ పేజీ తరువాయి

రీసైక్లింగ్ చేసే టెక్నాలజీ, తరగతి గదులు, ఇతర హాల్స్‌లోకి వెంటిలేషన్ వచ్చేలా నిర్మాణాలు చేపట్టారు. దీనిపై వర్సిటీ అధికారులు మాట్లాడుతూ సెమిస్టర్ పరీక్షలు పూర్తయిన వెంటనే విద్యార్థులకు నాలుగు వారాలు సెలవులు ఉంటాయని, అనంతరం నేరుగా నూతన క్యాంపస్‌లోకి వస్తారన్నారు.

మావోయిస్టులకు గట్టి దెబ్బ

... 5వ పేజీ తరువాయి

పోలీసులు.. గ్రేహౌండ్స్ బలగాలతో మంగళవారం ఉదయం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య జరిగిన కాల్పుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మడివి హిడ్మా(45), అతని భార్య మడకం రాజే(40), డివిజన్ కమిటీ సభ్యులుగ లక్మల్ అలియాస్ చైతు(35), దేవ్(36), మల్ల అలియాస్ మల్లాలు(35), కమ్లు అలియాస్ కమలేష్(36) మృతి చెందారని పోలీసులు ధ్రువీకరించారు.

పోలీసులు అప్రమత్తం

మారేడుమిల్లి అడవుల్లో మావోయిస్టు అగ్ర నేతలు హిడ్మా, రాజే తదితరులు ఎదురు కాల్పుల్లో మృతిచెందిన నేపథ్యంలో ఏవోబీలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ సంఘటనలో మరికొంతమంది తప్పించుకున్నారని నిఘా వర్గాల హెచ్చరికతో సరిహద్దుల్లోని సీలేరు, డొంకరాయి, మోతుగూడెం, జీకేవీధి పోలీసులతో పాటు ఒడిశాలోని పలు పోలీస్ స్టేషన్లను ఉన్నతాధికారులు అప్రమత్తం చేశారు. దీంతో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులు



భోజనం తయారీలో ఉపయోగించే సరకులు వివరాలు రాస్తున్న ఉపాధ్యాయుడు

'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన అధికార యంత్రాంగం

వంట సరకులు వివరాలు బోర్డుపై రాసి పెట్టాలని ఆదేశాలు

భోజనం పరిశుభ్రంగా, నాణ్యతగా ఉండాలని సూచనలు

నర్సీపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులు చోటు చేసుకున్నారు. 'నాసిరకంగా బడి భోజనం' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 8న ప్రచురించిన ప్రత్యేక కథనంతో అధికార యంత్రాంగం కదిలింది. ఈ మేరకు భోజనం నాణ్యత విషయంలో రాజీ పడవద్దని విద్యా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. సరకులు, కూరగాయలు ఒక్కొక్క విద్యార్థికి ఎన్ని గ్రాములు చొప్పున వాడుతున్నారో ప్రతీ రోజు నోటీసు బోర్డులో పెట్టాలని ఆదేశించారు. వంట శాల వద్ద శుభ్రత పాటించాలని, భోజనం నాణ్యత ఉండాలని హెచ్‌ఎంలకు, ఎంఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ వివరాలను నర్సీపట్నంలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం బోర్డులో రాసి పెట్టారు. ఎండీఎం ఇన్‌చార్జులు, హెచ్‌ఎం వంట శాల దగ్గర ఉండి ప్రతీది తనిఖీ చేస్తున్నారు. వంట సిబ్బంది వంటశాల వద్ద పరిశుభ్రత పాటించడంతో పాటు హేర్‌నెట్ (టోపీ)లు ధరించారు. జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అప్పారావు వంట శాల వద్ద కాటా ఏర్పాటు చేశారు. సిబ్బందికి కిచెన్ అప్రాన్స్, గ్లోవ్స్ అందజేశారు.



జడ్పీహెచ్ పాఠశాలలో పరిశుభ్ర వాతావరణంలో తయారు చేస్తున్న భోజనాలు

జుత్తాడలో 1117 శివలింగాలతో అష్టోత్తర పూజ



శివలింగాలతో అష్టోత్తర పూజ చేస్తున్న దృశ్యం

చోడవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జుత్తాడలో పురాతన మల్లికార్జున స్వామి ఆలయంలో 1117 మట్టితో తయారు చేసిన శివలింగాలతో మంగళవారం అష్టోత్తర పూజ కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు సంతోష్ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమానికి పెద్దఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, అనకాపల్లి మునిసిపల్ కమిషనర్ చక్రవర్తిలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కమిటీ ఛైర్మన్ రామకృష్ణ అచ్చింనాయుడు, సర్పంచ్ దొడ్డి ప్రసాద్ తదితరులు సహకరించారు. కార్యక్రమంలో సీఐ అప్పలరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు మత్స్యరాజు పాల్గొన్నారు.

సంకల్ప యాత్రతో ప్రజల్లో చైతన్యం

» విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ



సిబ్బందితో మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ

మాకవరపాలెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, గంజాయి వలన కలిగే అనర్థాలపై సంకల్ప యాత్ర ద్వారా 20 వేల సమావేశాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చామని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టీ తెలిపారు. మంగళవారం మాకవరపాలెం పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీలో గంజాయి సాగును పూర్తిగా అరికట్టామన్నారు. డ్రోన్, శాటిలైట్ ద్వారా గంజాయి తోటలను గుర్తించి వాటిని నాశనం చేశామన్నారు. ప్రస్తుతం ఒడిశా నుంచి గంజాయి వస్తోందని, దీనిని కూడా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా, నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రేవతమ్మ, ఎస్ఐ దామోదర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చెట్టు పైనుంచి జారి పడి కూలీ మృతి



నాగేశ్వరరావు (ఫైల్)

కొత్తూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చెట్టు ఎక్కి కొబ్బరికాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పడిన సంఘటనలో రోజువారీ కూలీ మృతి చెందాడని అనకాపల్లి రూరల్ ఏఎస్ఐ భూలోకరావు మంగళవారం తెలిపారు. కశింకోట గ్రామానికి చెందిన కొత్తం నాగేశ్వరరావు (46) కొబ్బరి కాయలు తీసేందుకు అనకాపల్లి మండలం సంపతిపురం గ్రామానికి పని నిమిత్తం వెళ్లాడన్నారు. అక్కడ చెట్టు ఎక్కి కొబ్బరికాయలు కోస్తుండగా కింద పడి తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. వెంటనే కుటుంబ సభ్యులు అనకాపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారని, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఏఎస్ఐ తెలిపారు. నాగేశ్వరరావుకు భార్య మంగ, కుమారుడు నరేశ్ ఉన్నారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

నేడు స్పీకర్ నాతవరం రాక

నాతవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు బుధవారం నాతవరం మండలానికి రానున్నారని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ తెలిపారు. మండల కేంద్రంలో జరిగే అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో స్పీకర్ పాల్గొంటారని చెప్పారు. ఇందులో భాగంగా రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం రూ.7 వేలు వేస్తుందని, కొందరి రైతులకు స్పీకర్ చెక్కులు అందజేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన కోరారు.

ఏజీపీగా లోవరాజు నియామకం



ఏజీపీ లోకా లోవరాజు

నర్సీపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నాతవరం మండలం ఏపీపురం గ్రామానికి చెందిన న్యాయవాది లోకా లోవరాజును నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ల పాటు ఈ పదవిలో ఆయన కొనసాగుతారు. ప్రభుత్వానికి సంబంధించిన సివిల్ కేసులను ఆయన వాదిస్తారు. బార్ అసోసియేషన్ సభ్యులు, పలువురు న్యాయవాదులు లోవరాజుకు అభినందనలు తెలిపారు.

ఘనంగా రేట్లమ్మతల్లి జాతర

నాతవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గొలుగొండపేటలో మంగళవారం రేట్లమ్మతల్లి జాతర ఘనంగా జరిగింది. తెల్లవారు నుంచే భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడికి అభినందనలు

నర్సీపట్నం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎంపికైన నర్సీపట్నం డీఈఈ ఈశ్వరరావును పలువురు అభినందించారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.గజ్జాలమ్మ, సభ్యులు ఈశ్వరరావుకు మంగళవారం పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాల పంపిణీ



సీఎం సహాయనిధి మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.92వేలు మంజూరు పత్రాలను స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కన్నంపాలెం గ్రామానికి చెందిన బైన రాముకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, టీడీపీ మండల అధ్యక్షుడు మత్స్యరాజు, పట్టణ అధ్యక్షుడు ఎర్రంశెట్టి చిన్న, జనసేన నాయకుడు సిరిపురపు రమేష్, టీడీపీ నాయకులు పెదబాబు, మజ్జి గౌరీ శంకర్, సకురు కోటేశ్వరరావు, సేనాపతి శ్రీను, కన్నంపాలెం సర్పంచ్ బర్ల తాతయ్యలు, బర్ల హరికృష్ణ, కొల్లి శ్రీను, సిరిపురపు రమేష్, కర్రి రమేష్ పాల్గొన్నారు.

గుండుపాల రోడ్డులో కల్వర్టు శిథిలం



శిథిలమైన కల్వర్టు ఇదే..

గొలుగొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తఎల్లవరం-గుండుపాల రహదారిలో తలుపులమ్మ గుడి వద్ద కల్వర్టు శిథిలమైంది. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. నెల రోజులుగా ఈ దుస్థితి ఉన్నప్పటికీ, కల్వర్టు మరమ్మతుల విషయం పట్టించుకునే నాథులే కరువయ్యారని గుండుపాల, కొత్తఎల్లవరం, కరక, కశిమి, రాజుపేట గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోండి

రోలుగుంట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నిర్వహించే పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని రోలుగుంట పశువైద్యాధికారి నూకేశ్వరరావు అన్నారు. మంగళవారం కొంతలంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అమలువుతున్న పలు పథకాలను సక్రమంగా వినియోగించుకుని పాడి రైతులు ఆదాయాన్ని పెంచుకోవాలని కోరారు. ఈ శిబిరంలో 48 పశువులకు గర్భకోశ పరీక్షలు జరిపి మందులు అందజేశారు. 42 పశువులకు గాలికుంటి వ్యాధి నివారణ టీకాలు వేశారు. అలాగే పలువురు రైతులకు మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, బలవర్ధక టానిక్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రాజేశ్వరి, రాజు, శివ, సాయికృష్ణ, దివ్య, హరిక పాల్గొన్నారు.

రెండు షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

మాడుగుల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాడుగులలోని ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న రెండు షాపులు అద్దెకు ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్‌సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఎం.సత్యపద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు తెలుపు రేషన్ కార్డు, ఆధార్, పాన్‌కార్డు, ఎస్సీ కుల ధ్రువీకరణతో పాటు 20 నుంచి 60ఏళ్ల లోపు నిరుద్యోగులై, పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారై ఉండాలన్నారు. ఈనెల 24 నుంచి డిసెంబరు 2వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు విశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఈ షాపుల ఎంపిక జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతుందని, ఎంపికైన వారు మూడు నెలల అద్దె డీడీ రూపంలో సెక్యూరిటీ డిపాజిట్ తీసుకుంటామన్నారు.

రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో లేఖ్యశ్రీకి స్వర్ణం

నాతవరం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాయి వ్యాసరచన పోటీల్లో నాతవరం మండలంలోని వీబీ.అగ్రహారం గ్రామానికి చెందిన బొబ్బర లేఖ్యశ్రీ స్వర్ణ పథం సాధించారు. శ్రీసత్యసాయి సేవా సంస్థలు 'డ్యూటీ ఇస్ గాడ్' అనే అంశంపై రాష్ట్ర సాయిలో ఈ పోటీలు నిర్వహించాయి. ఈ పోటీల్లో బొబ్బర లేఖ్యశ్రీ ప్రతిభ కనబర్చి బంగారు పథకం సాధించారు. ఈ నెల 23వ తేదీన శ్రీసత్యసాయి శతజయంతి వేడుకల్లో బంగారు పథకం అందజేస్తారని ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు లేఖ్యశ్రీని వీబీ అగ్రహారం గ్రామస్థులు, ఉపాధ్యాయులు అభినందించారు.

తిమిరాం శివాలయంలో ఎమ్మెల్యే బండారు పూజలు



ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తిని సన్మానించిన అర్చకులు

దేవరాపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమిరాం శివాలయంలో మాస శివరాత్రి సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, కూటమి నాయకులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద గోపూజ, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భజన బృందాలు భక్తి గీతాలు ఆలపించాయి. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, రైవాడ జలాశయ ఛైర్మన్ పాత్రునాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, అల్లు శ్రీను పాల్గొన్నారు.

ఆదుకుంటున్న సీఎం సహాయ నిధి

» నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు నీలవేణి

రావికమతం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన పేద కుటుంబాల వారికి సీఎం సహాయ నిధి ఆదుకొంటున్నదని మాడుగుల నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కోట నీలవేణి అన్నారు. మండలంలో కొత్తకోట గ్రామానికి చెందిన నెల్లూరు సుహాసిని ఇటీవల అనారోగ్యానికి గురై అనకాపల్లిలో చికిత్స పొందారు. ఆమె అభ్యర్థన మేరకు ఎమ్మెల్యే రాజు సిఫార్సుతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.23 వేల మంజూరయ్యాయి. ఈ మేరకు సుహాసినికి కోట నీలవేణి మంగళవారం మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట గోవిందరావు, దొరబాబు పాల్గొన్నారు.

డిజిటల్ లైబ్రరీతో యువతకు మేలు

మాడుగుల రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు డిజిటల్ లైబ్రరీ ఎంతో మేలు చేస్తుందని ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం జమ్మాదేవిపేటలో శ్రీ గోసమాంబ ప్రొడ్యూసర్స్ అండ్ ఫార్మర్స్ కంపెనీ సీఈవో వడ్డి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీలో శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఆర్కే ప్రసాద్, సన్యాసయ్యశెట్టి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి సత్యసాయి శతవర్ష జయంతి వేడుకలు

మాడుగుల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మోదమాంబ కాలనీలోని బాబా మందిరంలో సత్యసాయి శతవర్ష జయంతి వేడుకలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నారు. ఇందుకు సత్యసాయి సేవాసమితి సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 5 గంటల నుంచి ఒంకార సుప్రభాతం మొదలుకొని పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పక్కా గృహాలు ఉన్న వారందరికీ యాజమాన్య హక్కు

చీడికాడ, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): గ్రామాలలో పక్కా గృహాలు ఉన్న వారందరికీ యాజమాన్య హక్కు పత్రాలను ప్రభుత్వం అందిస్తుందని ఇన్‌చార్జి ఎంపీడీవో కే శ్రీనివాసరావు అన్నారు. మండలంలో జి.కొత్తపల్లి, చినగోగాడ గ్రామాలలో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఉన్న ఇళ్లను కొలిచిన అనంతరం హక్కు పత్రాలను యజమానులకు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొల్లి సూరి నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు అద్దేపల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాజు పర్యటనను విజయవంతం చేయండి

రోలుగుంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బుధవారం ఉదయం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పర్యటనను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పంచాడ చంద్ర పేర్కొన్నారు. మధ్యాహ్నం సంతబయలు వద్ద అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ 21వ విడత నిధులను రైతులకు విడుదల చేస్తారన్నారు.

వీవోఏల దెబ్బకు లబోదిబోమంటున్న డ్వాక్రా మహిళలు

2019 నుంచి రుణాలు వాడుకున్న వీవోఏలు

వారి వద్దే సభ్యుల బ్యాంకు పాస్ పుస్తకాలు, మినిట్స్ పుస్తకాలు

రుణాలు చెల్లించాలని బ్యాంకర్లు నోటీసులు

బయటపడిన అక్రమాలు

పరారీలో వీవోఏలు

మాడుగుల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలకు ఇద్దరు వీవోఏలు టోకరా వేశారు. మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని బ్యాంకు రుణాలు పొంది వారిద్దరు లక్షలాది రూపాయలు స్వాహా చేశారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో వారు పరారీ అయ్యారు. వివరాల్లోకి వెళితే..

మండలంలోని అవురివాడ పంచాయతీ ఏ వీరనారాయణంలో 22 సంఘాలకు వీవోఏగా రావాడ దేవుడమ్మ, తుమ్మవానిపాలెంలో 21 గ్రామాఖ్య సంఘాలకు వీవోఏగా రావాడ కొండబాబు (భార్యాభర్తలు) ఉన్నారు. వీరిద్దరు డ్వాక్రా సంఘాలకు సంబంధించిన అన్ని వ్యవహారాలు చూస్తున్నారు. వీరిపై డ్వాక్రా మహిళలకు నమ్మకం ఏర్పడింది. దీంతో వారి బ్యాంకు పుస్తకాలు, మినిట్స్ పుస్తకాలు, అప్పులకు సంబంధించిన పుస్తకాలు అన్నీ ఇద్దరి వీవోఏల వద్దే ఉండేవి. వారిద్దరూ తమపై నమ్మకం పెంచుకున్నారు. చివరకు వారు ఎక్కడ వేలుముద్రలు పెట్టమంటే అక్కడ పెట్టేసేవారు. ఇదే అదునుగా భావించిన ఆ ఇద్దరు వీవోఏలు 2019 నుంచి డ్వాక్రా మహిళలకు తెలియకుండా తీర్మానాల్లో సంతకాలు చేయించి వారి పేరున బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి, హెచ్‌డీ వంటి రుణాలు మంజూరు చేయించుకొని కాజేశారు. ఆ రుణాలకు సంబంధించి అప్పటి సీసీ తీడ అప్పలనాయుడు ఉన్న సమయంలో అంచెలంచెలుగా కొంతమేర కట్టుకు వచ్చారు. అయితే సీసీ అప్పలనాయుడు బదిలీపై 2024 సెప్టెంబరు నెలలో వెళ్లిపోయాడు. అప్పటి నుంచి బ్యాంకుకు నగదు జమ కాలేదు. దీంతో బ్యాంకర్లు డ్వాక్రా సంఘాలకు నోటీసులు జారీచేశారు. అయితే వీవోఏలు డ్వాక్రా గ్రూపులతో నిర్వహించే సమావేశాలు, ఆర్థిక లావాదేవీలు, రుణాలు, ప్రభుత్వం అందించే పథకాల గురించి సభ్యులకు అవగాహన కలించే విషయంలో సీసీల పర్యవేక్షణ ఉండాలి. అది లేకపోవడంతో ఉన్న 43 గ్రూపుల్లో 35 గ్రామాఖ్య సంఘాల మహిళల పేరిట రూ. 50లక్షల రుణాలు కాజేశారు. అయితే వీటిలో కొన్ని గ్రూపులకు సంబంధించి నగదు రికవరీ చేయగా, మిగిలిన గ్రూపుల సొమ్మును పట్టుకొని ఆ ఇద్దరి వీవోఏలు పరారయ్యారు. అంతే కాకుండా మండలంలో సీతాబందల, కాగిత, పెదగొర్రిగెడ్డ, తుమ్మవానిపాలెం గ్రామాలకు చెందిన అమాయకులకు మాయ మాటలు చెప్పి గృహాలు, భూములపై రుణాలు, తాకట్టుకి డబ్బులు ఇప్పిస్తామని నమ్మించి సుమారు రూ.20లక్షల వరకు కాజేశాడని బాధితులు లబోదిబోమంటున్నారు.

వీవోఏల చేతివాటానికి సీసీ పర్యవేక్షణ లోపం కూడా..

» వెలుగు ఏపీఎం రమణికుమారి

వీవోఏలు డ్వాక్రా సభ్యులకు సక్రమంగా రుణాలు మంజూరు చేయిస్తున్నారా.. రుణాలు తిరిగి వసూలు చేస్తున్నారా.. సమావేశాలు తరచూ నిర్వహిస్తున్నారా అని సీసీ పర్యవేక్షించాలని, ఆయన పర్యవేక్షణలో లోపం ఉండడం వల్లే డ్వాక్రా మహిళలు మోసపోయారని వెలుగు ఏపీఎం రమణికుమారి అన్నారు. ఎప్పటికప్పుడు గ్రూపులో సభ్యులందరిని పిలిచి సమావేశాలు నిర్వహించాలని సూచిస్తున్న నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. ఇదే కాకుండా స్థానికంగా లేనివారు కూడా గ్రూపుల్లో ఉండడంతో సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఇకపై డ్వాక్రా గ్రూపులో ఉన్న ప్రతి సభ్యురాలు నెల నెల నిర్వహించే సమావేశానికి హాజరు కావాల్సిందేనన్నారు. సభ్యులు సమావేశాలకు రాకపోవడం వల్లే లక్షలాది రూపాయలు వీవోఏలు కాజేశారన్నారు. దానికి సంబంధించి అన్ని రికార్డులు పరిశీలిస్తున్నామని, ఆ ఇద్దరు వీవోఏలు నగదు కాజేసి ఉడాయించారన్నారు. అన్ని కోణాల్లో విచారించి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వైసీపీ మండల అధ్యక్షుడిగా కొండబాబు

బుచ్చెయ్యపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల అధ్యక్షుడిగా జోగా కొండబాబు నియమితులయ్యారు. ప్రస్తుతం పెదమదిన గ్రామానికి చెందిన కొలిమళ్ల అచ్చింనాయుడు అధ్యక్షుడిగా కొనసాగుతుండగా ఆయన స్థానంలో అదే గ్రామానికి చెందిన యాదవ సామాజిక వర్గానికి చెందిన జోగా కొండబాబును వైసీపీ మండల అధ్యక్షుడిగా నియమించారు. దీనిపై కొండబాబు మాట్లాడుమూ అవకాశం కల్పించిన పార్టీ అధినేత జగన్ , జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, జడ్పీటీసీ సభ్యుడు రాంబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

కాయిన్ ఆట ఆడుతున్న ఏడుగురి అరెస్టు

రూ.62 వేలు నగదు, 21 ద్విచక్ర వాహనాలు స్వాధీనం



పట్టుబడిన కాయిన్ ఆటగాళ్లతో పోలీసులు

దేవరాపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేవరాపల్లి సమీపంలో కొల్లి అప్పలనాయుడు కల్లాల్లో కాయిన్ ఆట ఆడుతున్న వ్యక్తులను దేవరాపల్లి పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. కె.కోటపాడు సీఐ పైడపునాయుడు, ఎస్ఐ.పి.సత్యనారాయణ సిబ్బందితో దాడి చేశారు. వారి వద్ద నుంచి రూ.62,200 నగదు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. అదనంగా అక్కడ నిలిపి ఉన్న 21 ద్విచక్ర వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. గ్రామాల్లో ఇలాంటివి ఏమి నిర్వహించినా తనకు సమాచారం వస్తుందని, ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎస్ఐ.సత్యనారాయణ తెలిపారు.

చినభీమవరంలో పనులను అడ్డుకున్న రైతులు

బుచ్చెయ్యపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో చినభీమవరంలో కడియాల రాజేశ్వరరావు జిల్లా కలెక్టర్‌కు అప్పగించిన 30 ఎకరాల భూమిని ఎవరూ ఆక్రమించకుండా చుట్టూ కందకాలు తవ్విస్తున్న పనులను రైతులు అడ్డుకున్నారు. ఈ భూములు తమ పేరున డి పట్టాలు ఉన్నాయని రైతులు పేర్కొన్నారు. అయితే గతంలో ఇచ్చిన డి పట్టాదారులు పీఓటి నిబంధనలు ఉల్లంగించినట్టు నిర్ధారణ కావడంతో అధికారులు రద్దు చేశారు. రైతులు చీపురుపల్లి మల్లమ్మ, ఎర్రన్న, నారాయణమ్మ, రొంగలి యర్రయ్య, చంద్రయ్య, తదితరులు కందకం పనులను అడ్డుకున్నారు.

23న చీడికాడలో జాబ్ మేళా

దేవరాపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): చీడికాడలో ఈనెల 23న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాకు 26 కంపెనీల ప్రతినిధులు హాజరవుతాయన్నారు. దేవరాపల్లి, కె.కోటపాడు, మాడుగుల నిరుద్యోగ యువతకు ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ఇన్వెస్టర్ సమ్మిట్‌లో మాడుగుల అభివృద్ధి అవకాశాలపై ప్రత్యేకంగా రూపొందించిన బ్రోచర్లను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులకు అందించామన్నారు. అలాగే తుఫాన్ పొంచి ఉన్న కారణంగా రైతులు వరి కోతలు చేపట్టాలని, కోసిన వరి పంటలను కుప్పలుగా వేయాలన్నారు.

కొమిర పాఠశాలకు అదనపు భవనాలు

» ఎంపీడీవో మహేష్

రావికమతం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొమిర ప్రాథమిక పాఠశాలకు నూతన అదనపు భవనాల మంజూరుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తామని ఎంపీడీవో మహేష్ తెలిపారు. మంగళవారం ఆయన ఎంఈవో-2 బ్రహ్మజీతో కలిసి ఆ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పెచ్చులూడిన శ్లాబ్‌ను గ్రామస్థులు చూపించారు. 63 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలకు రెండు భవనాలు ఉండేవని, వీటిలో ఒకటి శ్లాబ్ పెచ్చులూడి కూలేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఒకే తరగతి గదిలో చదువు చెప్పలేక 4,5 తరగతుల విద్యార్థులకు దేవాలయంలోకి పంపి పాఠాలు చెప్పాల్సి వస్తుందని గ్రామస్థులు ఎంపీడీవోకు వివరించారు. అలాగే పాఠశాలలో ఉన్న చేతి బోరు మోటారు బోరు లోపల కూరుకుపోయిందని, విద్యార్థులకు తాగునీరు లేక ఇబ్బందులు పడాల్సి వస్తుదని హెచ్‌ఎం అధికారులకు తెలిపారు. దీంతో అక్కడ నుంచే ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి ఎంపీడీవో ఫోన్ చేసి.. తక్షణమే కొమిర పాఠశాలలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. శిథిల భవనం తొలగించేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని ఎంఈవో-2 బ్రహ్మజీ తెలిపారు.